# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక :365 శనివారం 5-9-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/




## ఎల్‌నినో ఉగ్రరూపం..




- వచ్చే ఏడాది వాతావరణం భయానకం
- 2027లో తీవ్ర వాతావరణ పరిస్థితులకు అవకాశం
- ఎల్‌నినో బలపడుతోందని ఐరాస హెచ్చరిక
- 2027 ఫిబ్రవరి వరకు కొనసాగనున్న ఎల్‌నినో
- పసిఫిక్ సముద్రంలో పెరుగుతున్న నీటి ఉష్ణోగ్రతలు
- కరువులు, వరదలు, తుఫాన్ల ముప్పు
- పలు ప్రాంతాల్లో అడవుల్లో కార్చిచ్చుకు అవకాశం
- 2027లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలకు ఛాన్స్
- వాతావరణ మార్పులతో మరింత పెరగనున్న ముప్పు

### ఇస్రో జీఎస్ఎల్వీ–ఎఫ్17

## ప్రయోగం సక్సెస్




- నింగిలోకి దూసుకెళ్లిన నాటీ బాయ్..
- 2,367 కిలోల ఈఓఎస్-05 ఉపగ్రహం కక్ష్యలోకి
- రక్షణ, వ్యవసాయం, విపత్తుల నిర్వహణకు కీలకం
- సబ్-జీటీఓలోకి కచ్చితత్వంతో ఉపగ్రహ ప్రవేశం
- అత్యాధునిక ఇమేజింగ్ సామర్థ్యాలతో ఈఓఎస్-05
- స్వదేశీ క్రయోజెనిక్ ఇంజిన్ కీలక పాత్ర
- భూ పరిశీలన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయనున్న ఉపగ్రహం
- వర్షంలోనూ ప్రయోగాన్ని వీక్షించిన 1,500 మంది సందర్శకులు



## రేపు బీఆర్ఎస్ఎల్పీ సమావేశం

- ఎర్రవెల్లిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఉమ్మడి భేటీ
- కేసీఆర్ అధ్యక్షతన సమావేశం
- అసెంబ్లీ, మండలి వ్యూహంపై చర్చ
- కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై చర్చ
- హామీల అమలు, ప్రభుత్వ వైఫల్యాలపై సమీక్ష
- కృష్ణా, గోదావరి జలాల అంశంపై చర్చ
- ఏపీ జలదోపిడీపై అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్

సోమవారం నుంచి అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బీఆర్ఎస్ఎల్పీ సమావేశం ఆదివారం నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ అధినేత కె చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో మధ్యాహ్నం ఒంటిగంటకు భోజనం అనంతరం రెండు గంటలకు పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులతో కూడిన సంయుక్త -మిగతా 2 లో

### అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం

# తప్పుడు ప్రచారం

**ఏపీ అక్షరాస్యతపై మంత్రి లోకేశ్ ప్రకటనను తప్పుబట్టిన జగన్**

- ఇది పూర్తిగా తప్పుడు సమాచారంతో కూడిన ప్రచారమని విమర్శ
- ప్రభుత్వ గణాంకాలను ఉటంకిస్తూ వివరణ ఇచ్చిన మాజీ సీఎం
- ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు తగ్గుతున్నారని ఆందోళన వ్యక్తీకరణ
- విద్యాశాఖపై దృష్టి పెట్టాలని లోకేశ్‌కు సూచించిన జగన్

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : ఏపీలో అక్షరాస్యత రేటు 2024లో 72.6శాతం నుంచి 2026 నాటికి 82.1శాతానికి పెరిగిందంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటనపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్రంగా స్పందించారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని చూసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.






## కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

- ఉగ్రవాది హతం
- బుద్గామ్‌లో భద్రతా బలగాల సంయుక్త ఆపరేషన్
- అఫ్తార్ గలీ అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు
- ఓ ఉగ్రవాది హతం.. ఏకే రైఫిల్ స్వాధీనం
- సైన్యం, పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సంయుక్త గాలింపు
- కచ్చితమైన నిఘా సమాచారంతో ఆపరేషన్
- ఘటనాస్థలంలో ఇతర యుద్ధ సామగ్రి స్వాధీనం
- మరో ఉగ్రవాది కోసం కొనసాగుతున్న గాలింపు
- హతమైన ఉగ్రవాది వివరాలు తెలియాల్సి ఉంది

## ఇటలీకి సుదీర్ఘకాల ప్రధానిగా మెలోనీ రికార్డు






### సైనిక విన్యాసాలకు సిద్ధమైన

## ఇండియన్ ఎయిర్‌ఫోర్స్

భారత్ సైనిక విన్యాసాలకు సిద్ధమవుతుండటంతో పాకిస్థాన్‌లో కలకలం మొదలైంది. రాజస్థాన్‌లో సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 7 వరకు 17 రోజుల పాటు విన్యాసాలు నిర్వహించేందుకు నోటమ్ జారీ అయింది. దీంతో పాక్ రక్షణ అధికారులు ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి సరిహద్దుల్లో నిఘా పెంచాలని ఆదేశించినట్లు సమాచారం. 02

- భారత్--పాక్ సరిహద్దులో 17 ని రోజులపాటు భారీ డ్రిల్స్
- సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 7 వరకు కొనసాగనున్న విన్యాసాలు
- ఎయిర్‌స్పేస్ ఆంక్షల కోసం నోటమ్ జారీ
- భారత సైనిక కదలికలపై పాక్ నిఘా
- సరిహద్దులో భద్రత పెంచాలని సైనిక అధికారుల ఆదేశాలు
- విన్యాసాలపై పాక్ రక్షణ శాఖ ఉన్నతస్థాయి సమీక్ష
- భారత వైమానిక దళం సంసిద్ధతపై పర్యవేక్షణ
- ఎయిర్‌స్పేస్ భద్రతకు ప్రత్యేక చర్యలు

### సురేఖను తప్పించడం

# బాధాకరం



**క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టీకరణ**

- పార్టీలోనే కొనసాగాలని సురేఖను కోరుతున్నాం
- బహిరంగంగా మీడియాతో మాట్లాడటం క్షమించరాని తప్పిదం
- సురేఖ కుమార్తె వ్యాఖ్యలపై అధిష్ఠానం ఆగ్రహం
- పార్టీ నియమాలను ఉల్లంఘించినందుకే కఠిన నిర్ణయం
- సీఎం రేవంత్‌కు బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదు
- పార్టీకి నష్టం కలిగించే వారిని హైకమాండ్ ఉపేక్షించదు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్

హైదరాబాద్,

: మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తప్పించడం బాధాకరమైన విషయమని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. సురేఖ బర్తరఫ్ అంశంపై శుక్రవారం ఆయన స్పందించారు. పార్టీలో ఎవరైనా క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అధిష్ఠానం నుంచి కఠిన చర్యలు తప్పవని స్పష్టంచేశారు. నాయకులకు తమ అభిప్రాయాలు, సమస్యలను చెప్పుకొనేందుకు పార్టీలో అంతర్గతంగా ఎన్నో వేదికలు ఉన్నాయని, వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటం క్షమించరాని -మిగతా 2 లో




## నేడే భారత్ పాక్ పోరు

**మహిళల ఆసియాకప్ సమరం**
**రాత్రి 8గం నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రసారం**

- దుబాయ్‌లో చిరకాల ప్రత్యర్థుల సమరం
- వరుస విజయాలతో సెమీస్‌కు చేరిన భారత్
- హ్యాట్రిక్ విజయంపై హర్మన్‌ప్రీత్ సేన కన్ను
- థాయ్‌లాండ్, హాంకాంగ్‌పై ఘన విజయాలు
- హాంకాంగ్‌పై స్మృతి మంధాన విధ్వంసక సెంచరీ
- 124 పరుగులతో చెలరేగిన మంధాన
- గ్రూప్ టాపర్‌గా నిలవాలని టీమిండియా పట్టుదల
- భారత్-పాక్ మ్యాచ్ రాత్రి 8 గంటలకు ప్రారంభం



## నేడు కరీంనగర్‌కు కేటీఆర్..

- అంబేద్కర్ స్టేడియంలో జెన్‌జీ సభ
- ఉద్యోగ అవకాశాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చ
- విద్యార్థులు, యువత భారీగా హాజరయ్యే అవకాశం
- సభ ఏర్పాట్లను పర్యవేక్షించిన గంగుల కమలాకర్
- యువత, విద్యార్థి సంఘాల నేతలతో సమీక్ష
- ఉదయం 10.15 గంటలకు సభకు చేరుకోనున్న కేటీఆర్
- సభకు జన సమీకరణపై బీఆర్ఎస్ నేతల దృష్టి

కరీంనగర్,

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ శనివారం కరీంనగర్ వస్తున్నట్టు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. అంబేద్కర్ మినీస్టేడియంలో విద్యార్థులు, యువత ఉద్యోగ అవకాశాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నిర్వహించే జెన్‌జీ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పర్యవేక్షించారు. యువత, విద్యార్థి సంఘాల -మిగతా 2 లో

# ఇస్రో జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగం సక్సెస్

- ౦ నింగిలోకి దూసుకెళ్లిన నాటీ బాయ్..
- ౦ 2,367 కిలోల ఈఓఎస్-05 ఉపగ్రహం కక్ష్యలోకి
- ౦ రక్షణ, వ్యవసాయం, విపత్తుల నిర్వహణకు కీలకం
- ౦ సబ్-జీటీఓలోకి కచ్చితత్వంతో ఉపగ్రహ ప్రవేశం
- ౦ అత్యాధునిక ఇమేజింగ్ సామర్థ్యాలతో ఈఓఎస్-05
- ౦ స్వదేశీ క్రయోజెనిక్ ఇంజిన్ కీలక పాత్ర
- ౦ భూ పరిశీలన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయనున్న ఉపగ్రహం
- ౦ వర్షంలోనూ ప్రయోగాన్ని వీక్షించిన 1,500 మంది సందర్శకులు



శ్రీహరికోట:
భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి శుక్రవారం తెల్లవారుజామున చేపట్టిన జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగం విజయవంతమైంది. రెండో ప్రయోగ వేదిక నుంచి తెల్లవారుజామున 2.55 గంటలకు నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీ-ఎఫ్17.. ప్రయోగం జరిగిన సుమారు 18 నిమిషాల తర్వాత 3.13 గంటలకు 2,367 కిలోల బరువున్న ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని నిర్దేశిత సబ్-జియోసింక్రోనస్ ట్రాన్స్ఫర్ ఆర్బిట్ (సబ్-జీటీఓ)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. పెరీజీ 170 కిలోమీటర్లు, అపోజీ 28,934 కిలోమీటర్లుగా ఉన్న ఈ కక్ష్యలోకి ఉపగ్రహాన్ని కచ్చితత్వంతో చేర్చడంలో ఇస్రో శాస్త్రవేత్తలు సఫలమయ్యారు. సుమారు 51.7 మీటర్ల ఎత్తు, 420.5 టన్నుల బరువున్న జీఎస్ఎల్వీ-ఎఫ్17 ద్వారా చేపట్టిన జీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది 19వ ప్రయోగం. ప్రస్తుతం ఈఓఎస్-05ను సబ్-జీటీఓ నుంచి తుది జియోస్టేషనరీ కక్ష్యలోకి చేర్చే ప్రక్రియ కొనసాగనుంది. ఇందుకోసం ఉపగ్రహంలోని ఆన్‌బోర్డ్ ప్రొపల్షన్ వ్యవస్థను వినియోగించనున్నారు. ఈఓఎస్-05 అత్యాధునిక భూ పరిశీలన సామర్థ్యాలతో రూపొందించిన ఉపగ్రహం. ఇందులో అమర్చిన ఎంఎక్స్-వీఎన్ఆర్ పేలోడ్ అధిక స్పేషియల్ రిజల్యూషన్‌తో భూ పరిశీలనకు ఉపయోగపడనుంది. విస్తృత ప్రాంతాలను స్పష్టంగా చిత్రీకరించడంతో పాటు తక్కువ వ్యవధిలోనే చిత్రాలను అందించే సామర్థ్యం ఈ ఉపగ్రహానికి ఉంది. జియోసింక్రోనస్ కక్ష్యలో ఉండే ఈఓఎస్-05 భారత ఉపఖండాన్ని తరచుగా పర్యవేక్షించేందుకు దోహదపడనుంది. ఈ ఉపగ్రహం నుంచి లభించే చిత్రాలు రక్షణ రంగానికి ఎంతో ఉపయోగపడనున్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో పరిస్థితులను పర్యవేక్షించడం, కీలక ప్రాంతాల్లో చోటుచేసుకునే మార్పులను గుర్తించడం వంటి అవసరాలకు ఈ డేటాను వినియోగించవచ్చు. వరదలు, తుపాన్లు, కొండచరియలు విరిగిపడటం వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభావిత ప్రాంతాలను వేగంగా గుర్తించేందుకు కూడా ఉపగ్రహ సమాచారం ఉపయోగపడనుంది. సహాయక చర్యలు, రెస్క్యూ ఆపరేషన్లు, అత్యవసర ప్రణాళికలను మరింత సమర్థంగా రూపొందించేందుకు ఇది దోహదం చేయనుంది. వ్యవసాయ రంగంలోనూ ఈఓఎస్-05 కీలకంగా మారనుంది. పంటల పరిస్థితి, సాగు విస్తీర్ణం, భూమిలో తేమ, నీటి వనరుల స్థితి వంటి అంశాలను పర్యవేక్షించేందుకు ఉపగ్రహ డేటాను వినియోగించవచ్చు. వ్యవసాయ ప్రణాళికలు, నీటి నిర్వహణ, పంటల అంచనాల్లో ఇది ఉపయోగపడనుంది. అలాగే అడవుల విస్తీర్ణంలో మార్పులు, పట్టణ ప్రాంతాల విస్తరణ, భూ వినియోగంలో మార్పులు, సహజ వనరుల పరిస్థితిని దీర్ఘకాలంగా పర్యవేక్షించేందుకు కూడా ఈ ఉపగ్రహం దోహదపడనుంది. జీఎస్ఎల్వీ-ఎఫ్17 మూడు దశల ప్రయోగ వాహకనౌక. ఇందులో అత్యంత క్లిష్టమైన స్వదేశీ క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్ ప్రయోగ విజయానికి కీలకంగా నిలిచింది. ఈ దశ సమర్థంగా పనిచేయడంతో ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడం సాధ్యమైంది. స్వదేశీ క్రయోజెనిక్ సాంకేతికతపై ఇస్రో సాధించిన పట్టు మరోసారి నిరూపితమైంది. జీఎస్ఎల్వీ రాకెట్ గతంలో కొన్ని అనూహ్య ఫలితాలను ఎదుర్కొన్న నేపథ్యంలో దీనికి 'నాటీ బాయ్' అనే మారుపేరు వచ్చింది. 2021 ఆగస్టులో జీఎస్ఎల్వీ-ఎఫ్10 ద్వారా ప్రయోగించిన జీశాట్-1 ఉపగ్రహం నిర్దేశిత కక్ష్యను చేరుకోలేకపోయింది. అయితే ఆ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్న ఇస్రో.. సాంకేతికంగా మరింత మెరుగైన వ్యవస్థలతో చేపట్టిన తాజా ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. భారీ ఉపగ్రహాలను అధిక కక్ష్యల్లోకి ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని మరోసారి చాటుకుంది. జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు లాంచ్ వ్యూ గ్యాలరీకి సుమారు 1,500 మంది సందర్శకులు తరలివచ్చారు. తెల్లవారుజామున 2 గంటల నుంచే వర్షం కురుస్తున్నప్పటికీ వారు వెనక్కి తగ్గలేదు. వర్షంలో తడుస్తూనే రాకెట్ నింగిలోకి దూసుకెళ్లిన అద్భుత ఘట్టాన్ని వీక్షించారు. ఈఓఎస్-05 ప్రయోగం భారత భూ పరిశీలన సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు రక్షణ, విపత్తుల నిర్వహణ, వ్యవసాయం, అటవీ, పర్యావరణ పర్యవేక్షణ వంటి అనేక రంగాలకు ఉపయోగకరమైన సమాచారాన్ని అందించనుంది. స్వదేశీ రాకెట్లు, క్రయోజెనిక్ సాంకేతికత, అధునాతన ఉపగ్రహ వ్యవస్థలతో అంతరిక్ష రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతికి జీఎస్ఎల్వీ-ఎఫ్17 విజయం మరో నిదర్శనంగా నిలిచింది.

## సైనిక విన్యాసాలకు సిద్ధమైన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్..

- -భారత్--పాక్ సరిహద్దులో 17 రోజులపాటు భారీ డ్రిల్స్
- -సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 7 వరకు కొనసాగనున్న విన్యాసాలు
- -ఎయిర్‌స్పేస్ ఆంక్షల కోసం నోటమ్ జారీ
- -భారత సైనిక కదలికలపై పాక్ నిఘా
- -సరిహద్దులో భద్రత పెంచాలని సైనిక అధికారుల ఆదేశాలు
- -విన్యాసాలపై పాక్ రక్షణ శాఖ ఉన్నతస్థాయి సమీక్ష
- -భారత వైమానిక దళం సంసిద్ధతపై పర్యవేక్షణ
- -ఎయిర్‌స్పేస్ భద్రతకు ప్రత్యేక చర్యలు



ఇండియా సైనిక కార్యకలాపాలను ప్రారంభించిందంటే చాలు పాకిస్తాన్‌లో వణుకు ప్రారంభమవుతుంది. తాజా పరిణామాలే ఇందుకు ఉదాహరణ. భారత నావికాదళం త్వరలో సైనిక విన్యాసాలు నిర్వహించేందుకు నోటం (నోటీస్ టు ఎయిర్ మిషన్స్) జారీ చేసింది. నావికాదళానికి సంబంధించిన సైనిక విన్యాసాలకు సంబంధించిన ఏర్పాట్ల కోసం ఈ నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఇండియా-పాకిస్తాన్ సరిహద్దులో, రాజస్థాన్‌లో 17 రోజులపాటు నోటం జరగనుంది. సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 7 వరకు ఈ సైనిక విన్యాసాలు కొనసాగుతాయి. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను వాయుసేన విడుదల చేసింది. అయితే, మన ఎయిర్‌ఫోర్స్ సైనిక విన్యాసాలు చేసేందుకు సిద్ధమవుతుంటే పాకిస్తాన్ వణికిపోతోంది. పాకిస్తాన్ రక్షణ శాఖ అధికారులు ఆకస్మికంగా ఒక ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఇండియా చేపట్టనున్న సైనిక విన్యాసాలపై సమీక్ష నిర్వహించారు. ఇస్లామాబాద్‌లో ఉన్న భద్రతా దళాలా చీఫ్ ఆధ్వర్యంలో ఈ సమీక్ష జరిగింది. ఇండియా-పాక్ సరిహద్దులో ఈ సైనిక విన్యాసాల వల్ల కలిగే పరిణామాలపై చర్చించారు. ఇదే సమయంలో భారత సరిహద్దులో నిఘా పెంచాలని అక్కడి సైనిక అధికారులు ఆదేశించారు. మన సైనిక విన్యాసాల్ని పాక్ సైన్యం నిరంతరం పర్యవేక్షించనుంది. భారత వైమానిక దళానికి సంబంధించి చేపట్టే మార్పులు, సంసిద్ధత, నిషేధాలు వంటి అంశాలపై విమాన ఆపరేటర్లు, సంబంధికులకు అందే రక్షణ నోటిఫికేషన్ నోటం. సైనిక డ్రిల్స్ నిర్వహిస్తున్నప్పుడు మామూలుగానే నోటం జారీ చేస్తుంటారు. ఎయిర్‌స్పేస్‌లో నిషేధాజ్ఞలు, భద్రత వంటివి దీని పరిధిలోకి వస్తాయి. 17 రోజులపాటు భారీ సైనిక విన్యాసాలు జరగనున్నాయి.

## ఎల్‌నినో ఉగ్రరూపం..

- ౦ వచ్చే ఏడాది వాతావరణం భయానకం
- ౦ 2027లో తీవ్ర వాతావరణ పరిస్థితులకు అవకాశం
- ౦ ఎల్‌నినో బలపడుతోందని ఐరాస హెచ్చరిక
- ౦ 2027 ఫిబ్రవరి వరకు కొనసాగనున్న ఎల్‌నినో
- ౦ పసిఫిక్ సముద్రంలో పెరుగుతున్న నీటి ఉష్ణోగ్రతలు
- ౦ కరువులు, వరదలు, తుఫాన్ల ముప్పు
- ౦ పలు ప్రాంతాల్లో అడవుల్లో కార్చిచ్చుకు అవకాశం
- ౦ 2027లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలకు ఛాన్స్
- ౦ వాతావరణ మార్పులతో మరింత పెరగనున్న ముప్పు




జెనీవా:
అతి పెద్ద ఎల్‌నినో రూపుదిద్దు కుంటోందని ఐక్యరాజ్య సమితి(ఐరాస) సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ హెచ్చరించారు. 2027లో తీవ్ర వాతావరణ పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని అన్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) తాజా అంచనా ప్రకారం 2027 ఫిబ్రవరి వరకు ఎల్‌నినో కొనసాగే అవకాశం దాదాపు 100 శాతం ఉంది. ఇంత నిశ్చితంగా ఇంతకుముందు ఎప్పుడూ చెప్పలేదు. పసిఫిక్ మహాసముద్రంలో అసాధారణంగా పెరిగిన నీటి ఉష్ణోగ్రతల వల్ల ఎల్‌నినో మరింత బలపడుతోంది. 2026 చివరికి చాలా బలమైన స్థాయికి చేరుకుని తీవ్రస్థాయికి వెళ్తుందని అంచనా. దాని ప్రభావాలు 2027లో కూడా కొనసాగుతాయి. మన కళ్లముందే ఎల్‌నినో అతి పెద్దదిగా మారుతోందని గుటెరెస్ అన్నారు. శాస్త్రం సందేహానికి తావు ఇవ్వడం లేదు. భూగోళం ఇంతకుముందు చూడని జలాల్లో ఉంది, ఆ జలాలు వేడెక్కుతున్నాయి అని ఆయన చెప్పారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ప్రపంచ ఉష్ణోగ్రతలు పైకి వెళున్నాయి, ప్రపంచం తీవ్ర వాతావరణ ప్రమాద మండలంలో ఉందని హెచ్చరించారు. పెరుగుతున్న ప్రమాదాలు, ప్రజలను రక్షించే వాతావరణ చర్యల మధ్య పోటీ నడుస్తోంది, ఈ పోటీని గెలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎల్‌నినో ఉగ్రరూపం సమాజాలు, ఆర్థిక వ్యవస్థలపై పెద్ద దెబ్బ తీయగలదని డబ్ల్యూఎంఓ చీఫ్ సెలెస్టే సౌలో అన్నారు. కరువులు, వరదలు ఇప్పటికే అంతరాయం, విధ్వంసం కలిగిస్తున్నాయి. ఎల్ నినో బలపడిన కొద్దీ ఇవి మరింత తీవ్రమవుతాయని ఆమె చెప్పారు. మధ్య, తూర్పు భూమధ్యరేఖ పసిఫిక్‌లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సగటు కంటే చాలా ఎక్కువగా ఉన్నాయి. ఇంకా పెరుగుతున్నాయి. నినో 3.4 సూచిక 2026 మే నుంచి జులై వరకు సగటున 1.5 డిగ్రీల సెల్సియస్ పైన ఉంది. అది జులైలో 2.0 డిగ్రీల సెల్సియస్ పైనకు చేరింది. సెప్టెంబరు నుంచి నవంబరు వరకు దాదాపు అన్ని భూభాగాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఎక్కువ. వర్షపాత నమూనాలు కూడా మారతాయి. కొన్ని ప్రాంతాల్లో కరువు, అడవుల్లో కార్చిచ్చు, మరికొన్ని చోట్ల భారీ వర్షాలు, వరదలు, తుఫానులు రావచ్చు. 2027 సంవత్సరం రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలను నమోదు చేసుకునే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మానవ కారణాల వల్ల ఇప్పటికే పెరుగుతున్న ఉష్ణోగ్రతలపై ఎల్‌నినో మరింత వేడిని జోడిస్తుంది.

## కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

- -ఉగ్రవాది హతం
- -బుద్గామ్‌లో భద్రతా బలగాల సంయుక్త ఆపరేషన్
- -అఫ్తార్ గలీ అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు
- -ఓ ఉగ్రవాది హతం.. ఏకే రైఫిల్ స్వాధీనం
- -సైన్యం, పోలీసులు, సీఆర్పీఎఫ్ సంయుక్త గాలింపు
- -కచ్చితమైన నిఘా సమాచారంతో ఆపరేషన్
- -ఘటనాస్థలంలో ఇతర యుద్ధ సామగ్రి స్వాధీనం
- -మరో ఉగ్రవాది కోసం కొనసాగుతున్న గాలింపు
- -హతమైన ఉగ్రవాది వివరాలు తెలియాల్సి ఉంది



లిశ్రీనగర్:
జమ్మూకాశ్మీర్‌లోని బుద్గామ్ జిల్లాలో భద్రతా బలగాలు చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో ఓ ఉగ్రవాది హతమయ్యాడు. అఫ్తార్ గలీ అటవీ ప్రాంతంలో శుక్రవారం ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఉగ్రవాదుల కదలికలపై అందిన కచ్చితమైన నిఘా సమాచారంతో భారత సైన్యం, జమ్మూకాశ్మీర్ పోలీసులు, సీఆర్పీఎఫ్ సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. భద్రతా బలగాలకు అనుమానాస్పద కదలికలు కనిపించడంతో అక్కడ ఉన్నవారిని అప్రమత్తం చేశారు. దీంతో ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించగా, భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. ఘటనాస్థలంలో ఒక ఏకే రైఫిల్‌తో పాటు ఇతర యుద్ధ సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, హతమైన ఉగ్రవాది వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఇదే ప్రాంతంలో మరో ఉగ్రవాది దాక్కుని ఉండొచ్చన్న అనుమానంతో భద్రతా బలగాలు గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయి. కాశ్మీర్ లోయలో గత కొన్ని నెలలుగా ఉగ్రవాద కార్యకలాపాలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## నేడే భారత్-పాక్ పోరు



దుబాయ్:
మహిళల ఆసియాకప్-2026లో మరో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. నేడు దుబాయ్ వేదికగా చిరకాల ప్రత్యర్థులు భారత్-పాకిస్తాన్ మధ్య కీలక మ్యాచ్ జరగనుంది. గ్రూప్-ఎలో ఇప్పటికే వరుసగా రెండు విజయాలతో సెమీస్ బెర్తు ఖరారు చేసుకున్న టీమిండియా.. నేటి మ్యాచ్‌లో పాకిస్తాన్‌ను కూడా మట్టికరిపించి హ్యాట్రిక్‌తో పాయింట్స్ టేబుల్ టాపర్‌గా గ్రూప్ దశను ముగించాలని పట్టుదలతో ఉంది. తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌ను 94 పరుగుల తేడాతో చిత్తు చేసిన హర్మన్‌ప్రీత్ సేన.. రెండో మ్యాచ్‌లో హాంకాంగ్‌పై 137 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేసింది. దీంతో మరో మ్యాచ్ మిగిలుండగానే భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. ఓపెనర్ స్మృతి మంధాన 64 బంతుల్లోనే 14 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో ఏకంగా 124 పరుగులు చేసి విధ్వంసకర సెంచరీతో టీమిండియాకు అదిరే విజయాన్ని అందించింది. ఇక తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో పాక్‌పై కూడా అదే జోరు కొనసాగించాలని పట్టుదలతో ఉంది.

## రేపు బీఆర్ఎస్ఎల్పీ సమావేశం

మొదటి తరువాయి



సమావేశం జరగనుందని ఆ పార్టీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశానికి హాజరుకావాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ సూచించారని పేర్కొంది. తాజా రాజకీయ పరిణామాలు, కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన, ఇచ్చిన హామీల అమలు, వైఫల్యాలు, 22ఏ పరిధిలోని నిషేధిత భూములు, 97 జీవో వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థుల ఆందోళన, కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ ప్రభుత్వ నిర్లక్ష్యం, ఏపీ జలదోపిడీ వంటి అంశాలపై చర్చించనున్నారు. అసెంబ్లీ, శాసనమండలిలో అనుసరించాల్సిన వ్యూహం, లేవనెత్తిన అంశాలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

## ఇటలీకి సుదీర్ఘకాల ప్రధానిగా మెలోనీ రికార్డు

- -1,413 రోజుల పదవీకాలంతో మెలోనీ రికార్డు
- -రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అత్యధిక కాలం ప్రధాని
- -మెలోనీకి అభినందనలు తెలిపిన ప్రధాని మోదీ
- -మోదీకి ధన్యవాదాలు తెలిపిన ఇటలీ ప్రధాని
- -భారత్-ఇటలీ వ్యూహాత్మక భాగస్వామ్యంపై ఇరువురి ప్రశంసలు
- -రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం
- -మోదీ-మెలోనీ స్నేహం 'మెలోడీ'గా సోషల్ మీడియాలో ఫేమస్
- -భారత్-మధ్యప్రాచ్యం-యూరప్ కారిడార్‌పై కలిసి పనిచేయనున్న ఇరుదేశాలు



న్యూఢిల్లీ / రోమ్:
ఇటలీకి అత్యధిక కాలంగా పనిచేస్తున్న ప్రధానిగా జార్జియా మెలోనీ రికార్డు సృష్టించారు. మెలోనీ అక్టోబరు 22, 2022 నుంచి ఇటలీ ప్రధానమంత్రిగా పనిచేస్తున్నారు. గురువారం 1,413 రోజుల నిరంతర పదవీకాలం పూర్తయిన తర్వాత, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత దేశంలో అత్యధికకాలం నిరంతరం పనిచేసిన ప్రధానమంత్రిగా ఆమెనిలిచారు. గత రికార్డు సిల్వియో బెర్లుస్కోని పేరిట ఉండేది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ మెలోనీని అభినందిస్తూ, ఇటలీ ప్రజలు ఆమె నాయకత్వంపై ఉంచిన నమ్మకం, విశ్వాసం ఈ మైలురాయిలో ప్రతిబింబిస్తోందని చెప్పారు. నా స్నేహితురాలు ప్రధానమంత్రి మెలోనీకి అభినందనలు అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆమెతో స్నేహం భారత్-ఇటలీ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిందని, రెండు దేశాల ప్రజలకు సమృద్ధి భవిష్యత్తు నిర్మించేందుకు సన్నిహిత సహకారం కొనసాగించాలని ఆయన అన్నారు. వచ్చే సంవత్సరాల్లో ఆమె విజయాలకు శుభాకాంక్షలు తెలిపారు. దీనికి స్పందనగా ధన్యవాదాలు ప్రియమైన ప్రధాని మోడీ అని మెలోనీ అన్నారు. ఎక్స్‌లో చేసిన పోస్టులో ప్రియమైన నరేంద్ర మోడీ, మీ మాటలకు, మీ స్నేహానికి ధన్యవాదాలు అని రాశారు. ఇటలీ-భారత దేశం సంబంధం ఈ రోజు ఎప్పటికంటే బలంగా ఉందని అన్నారు. మన చివరి సమావేశంలో ప్రారంభించిన ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం ఈ బంధం ప్రాముఖ్యతను, రెండు దేశాల నైపుణ్యాలను కలిపి, వృద్ధికి కొత్త అవకాశాలు సృష్టించాలనే సంకల్పాన్ని గుర్తిస్తుందని చెప్పారు. ముందున్న అసాధారణ సహకార అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇటలీ, భారతదేశం కలిసి రెండు ఖండాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని, భారత్-మధ్యప్రాచ్యం-యూరప్ ఆర్థిక కారిడార్ అభివృద్ధికి కూడా కలిసి పనిచేస్తాయని విశ్వాసాన్ని మెలోనీ వ్యక్తం చేశారు. మోడీ-మెలోనీ స్నేహం సామాజిక మాధ్యమాల్లో 'మెలోడీ' అనే పేరుతో దృష్టిని ఆకర్షిస్తుంది. ఇటీవల రోమ్ పర్యటనలో మోడీ మెలోనీకి మెలోడీ చాక్లెట్ల ప్యాకెట్ బహుమతిగా ఇచ్చిన సందర్భం మళ్లీ చర్చనీయాంశమైంది. ఇరు నాయకుల స్నేహం ద్వైపాక్షిక సంబంధాలను మరింత లోతుగా చేస్తోందని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

## నేడు కరీంనగర్‌కు కేటీఆర్..

మొదటి తరువాయి



నాయకులతో కేటీఆర్ సభ, జన సమీకరణపై చర్చించారు. ఉదయం 10.15 గంటలకు కేటీఆర్ నేరుగా అంబేద్కర్ స్టేడియం చేరుకుని సభలో పాల్గొంటారని తెలిపారు.

## సురేఖను తప్పించడం బాధాకరం

తప్పిదమని ఆయన పేర్కొన్నారు. కొండా సురేఖ కుమార్తె చేసిన తీవ్ర వ్యాఖ్యలను కనీసం ఆమె ఖండించకపోవడాన్ని కాంగ్రెస్ హైకమాండ్ అత్యంత తీవ్రంగా పరిగణించిందని తెలిపారు. పార్టీ నియమాలను ఖాతరు చేయని వైఖరి కారణంగానే అధిష్ఠానం కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని మహేశ్‌కుమార్ వివరించారు. రాజకీయ లబ్ధి కోసం, ఒత్తిడి తేవడం కోసం ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం సీఎం రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం లేదని తేల్చిచెప్పారు. మంత్రి పదవి నుంచి తొలగించినప్పటికీ, కొండా సురేఖ పార్టీలోనే కొనసాగాలని తామంతా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని పేర్కొన్నారు. పార్టీ విధేయత, క్రమశిక్షణను కాపాడేందుకు అధిష్ఠానం ఈ కఠిన వైఖరి అవలంబించిందని, పార్టీకి నష్టం కలిగించేలా ఎవరు వ్యవహరించినా హైకమాండ్ చూస్తూ ఊరుకోదని మహేశ్‌కుమార్ స్పష్టంచేశారు.

## అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం

(మొదటి తరువాయి)

ఏ అధికారిక సంస్థ కూడా గణాంకాలను విడుదల చేయలేదు

2026 క్యాలెండర్ సంవత్సరం ఇంకా పూర్తి కానందున, అక్షరాస్యతకు సంబంధించి ఏ అధికారిక సంస్థ కూడా గణాంకాలను విడుదల చేయలేదని జగన్ స్పష్టం చేశారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖకు చెందిన ఎన్ఎస్ఎస్ఓ విడుదల చేసిన 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (పీఎల్ఎఫ్ఎస్) 2023-24 వార్షిక నివేదికను ఆయన ఉటంకించారు. దాని ప్రకారం.. 2023 జూన్ నుంచి 2024 జూన్ మధ్య కాలంలో ఏపీలో ఏడేళ్లకు పైబడిన వారిలో అక్షరాస్యత 72.6శాతంగా ఉందని, ఇదే 2018-19లో 69.1శాతంగా ఉండేదని గుర్తుచేశారు.

తప్పుడు వాదనలతో ప్రజలను మభ్యపెట్టాలని చూడటం అత్యంత దురదృష్టకరం అంతేకాకుండా, 2026 జులై 2న ప్రచురించిన పీఎల్ఎఫ్ఎస్ 2025 నివేదిక ప్రకారం.. 2025 జనవరి నుంచి 2025 డిసెంబర్ మధ్య కాలంలో రాష్ట్ర అక్షరాస్యత 71.4శాతంగా నమోదైందని తెలిపారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా ఉన్నప్పుడు, ప్రభుత్వం తప్పుడు వాదనలతో ప్రజలను మభ్యపెట్టాలని చూడటం అత్యంత దురదృష్టకరమని జగన్ వ్యాఖ్యానించారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయి

ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గి, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయని కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడీఐఎస్ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయని, ఇది ఆందోళన కలిగించే విషయమని జగన్ అన్నారు.

తన శాఖపై ఎక్కువ సమయం కేటాయించాలి.. 'రెడ్ బుక్ గవర్నెన్స్' మీద కాదు

ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్యను మరింత అందుబాటులోకి ఎలా తీసుకురావాలనే దానిపై దృష్టి పెట్టాల్సింది పోయి, టీడీపీ కూటమి ప్రభుత్వం మోసపూరిత వ్యూహాలతో తప్పుడు ప్రచారాలు చేసుకోవడంలో నిమగ్నమైందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి తన శాఖపై ఎక్కువ సమయం కేటాయించాలి కానీ 'రెడ్ బుక్ గవర్నెన్స్' మీద కాదని లోకేశ్‌కు హితవు పలికారు

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం ఉచిత అడ్మిషన్లపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

**-మార్గదర్శకాల సవరణ కోసం 16 మంది సభ్యులతో రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు**

**-సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా కొత్త నిబంధనల రూపకల్పన**

**-ఉపాధ్యాయ దినోత్సవం వేళ 173 మందికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు**

**-సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డుల ప్రదానం**

**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం అమలుకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లను నిరుపేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాల్సి ఉండగా, ఈ విధానంలో ఉన్న మార్గదర్శకాలను సవరించి, పటిష్ఠంగా అమలు చేసేందుకు ఒక రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఈ రిజర్వేషన్ ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా చూడటమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది.

**16 మంది సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు**

ఈ అంశంపై లోతుగా అధ్యయనం చేసేందుకు 16 మంది సభ్యులతో కూడిన కమిటీని ప్రభుత్వం నియమించింది. పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా ఈ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించనుండగా, సమగ్రశిక్షా ఎస్పీడీ కన్వీనర్‌గా ఉంటారు. వీరితో పాటు విద్యార్థుల తల్లిదండ్రుల ప్రతినిధులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు కూడా ఈ కమిటీలో స్థానం కల్పించారు.

**ఈ ఏడాది జనవరిలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు...**

జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ జారీ చేసిన ఆదేశాల నేపథ్యంలో ప్రస్తుత నిబంధనలను సవరించి, పకడ్బందీగా అమలు చేసేందుకు ఈ కమిటీ కృషి చేస్తుందని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కమిటీ త్వరలోనే సమావేశమై కొత్త మార్గదర్శకాలను ప్రభుత్వానికి సిఫార్సు చేయనుంది.

**173 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు**

మరోవైపు నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విశేష సేవలు అందించిన వారికి 'రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు-2026'ను ప్రకటించింది. మొత్తం 173 మందిని ఈ పురస్కారాలకు ఎంపిక చేసింది. వీరిలో పాఠశాల విద్యా విభాగం నుంచి 79 మంది, ఇంటర్ విద్య నుంచి 24 మంది, సాంకేతిక విద్య నుంచి 14 మంది, ఉన్నత విద్యా విభాగం నుంచి 56 మంది ఉన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వీరికి ప్రశంసాపత్రం, జ్ఞాపిక, పతకం, శాలువాతో పాటు రూ. 20 వేల నగదు బహుమతిని అందించి ఘనంగా సత్కరించనున్నారు.

# అశ్విని మృతి పట్ల విచారం వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**-విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా కల్పించడానికి లోతైన విచారణ అవసరం**

**-కమ్మదానం గురుకుల వసతి గృహాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 04 (జర్నలిస్ట్ డైరీ) :** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గురుకుల వసతి గృహంలో ఇంటర్మీడియట్ విద్యార్థిని అశ్విని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అత్యంత విచారకరమని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అశ్విని మృతి పట్ల సంతాపం ప్రకటించిన ఆయన, ఘటనపై లోతైన విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, అదే సమయంలో గురుకులంలో చదువుతున్న ఇతర విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఉన్న అపోహలు, ఆందోళనలను తొలగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కమ్మదనం గురుకుల పాఠశాలను ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి స్వయంగా సందర్శించి, విద్యార్థులు, సిబ్బంది, యాజమాన్యంతో మాట్లాడి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గురుకుల వసతి గృహంలో అనేక సమస్యలు ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు సరిపడా వాష్‌రూమ్‌లు లేకపోవడంతో పాటు ఉన్న వాష్‌రూమ్‌లు కూడా అధ్వాన స్థితిలో ఉన్నాయని, విద్యార్థులు ఆడుకునే సమయంలో విష సర్పాలు వస్తున్నాయని ఆయన తెలిపారు. అదేవిధంగా మహిళా సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహించేందుకు సరైన గది కూడా లేదని, రాత్రివేళల్లో, వర్షం సమయంలో రేకుల షెడ్డులో ఉండి విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉందని సెక్యూరిటీ సిబ్బంది తన దృష్టికి తీసుకొచ్చారని ఎమ్మెల్సీ తెలిపారు. విద్యార్థులకు, సిబ్బందికి కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. విద్యార్థుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొద్దునిద్ర వీడి తక్షణమే స్పందించాలని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యాశాఖపై కనీస అవగాహన లేని ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రిగా కొనసాగడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో వెంటనే మౌలిక వసతులు మెరుగుపరచాలని, విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం తక్షణమే గురుకులాల్లో అవసరమైన వసతులు కల్పించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# చదువుల కోసం పంపితే.. చాకిరీ చేయిస్తారా?

**-షాద్‌నగర్ ఎస్సీ సమీకృత హాస్టల్‌లో విద్యార్థులతో వంట సామగ్రి సరఫరా**

**-ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?**

**-ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆకాష్ నాయక్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 04 (జర్నలిస్ట్ డైరీ) :** విద్యార్థులకు విద్యతో పాటు భద్రమైన వాతావరణం కల్పించాల్సిన హాస్టల్‌లో వారితోనే పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. షాద్‌నగర్ పట్టణంలోని ఎస్సీ సమీకృత హాస్టల్‌లో కూరగాయలు, పండ్లు, గుడ్లు, ఇతర వంట సామగ్రిని తరలించే పనుల్లో విద్యార్థులను వినియోగిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆకాష్ నాయక్ ఆరోపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... .హాస్టల్ నిర్వహణలో భాగంగా అవసరమైన సరుకులను తీసుకురావడం, తరలించడం వంటి పనులను సిబ్బంది చేయాల్సి ఉండగా..విద్యార్థులతోనే ఆ పనులు చేయించడం సరికాదని ఆకాష్ నాయక్ అన్నారు. విద్యార్థులు చదువుకోవాల్సిన సమయంలో వారితో పనులు చేయించడం నిత్యకృత్యంగా మారిందని ఆరోపించారు.

**సరఫరా చేసే క్రమంలో ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?**

విద్యార్థులు వంట సామగ్రిని తరలించే క్రమంలో అనుకోని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు. చిన్న నిర్లక్ష్యం కూడా విద్యార్థుల భద్రతపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను హాస్టల్‌కు పంపేది చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలనే ఆశతోనే తప్ప పనులు చేయడానికి కాదని పేర్కొన్నారు. హాస్టల్‌లో విద్యార్థులతో పనులు చేయిస్తున్నారనే ఆరోపణలపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వాస్తవాలను పరిశీలించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# శ్రావణ శుక్రవారం సందర్భంగా అన్నపూర్ణాదేవి సన్నిధిలో ప్రత్యేక పూజలు



**యాచారం ( సెప్టెంబర్ 04) జర్నలిస్ట్ డైరీ** కొత్తపల్లిలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలోని అన్నపూర్ణాదేవి సన్నిధిలో శుక్రవారం ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహిళా భక్తుల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు కోరుకున్నారు.

శ్రావణ మాసంలో నిర్వహించిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో కుంకుమార్చనలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాలే అనితా రమేష్, దేప విజయశ్రీ, మల్‌రెడ్డి వసుంధర, యాదమ్మ, పద్మ, స్వరూప, మంజుల, ప్రశాంతి, అలివేలు, ప్రభావతి, జస్విక తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లిలో సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

**- 84 బాధిత కుటుంబాలకు**

**రూ. 53,24,150/- ఆర్థిక సహాయం అందజేత**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 04 (జర్నలిస్ట్ డైరీ) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 53,24,150/- యాభై మూడు లక్షల ఇరవై నాలుగు వేల నూట యాభై రూపాయల ఆర్థిక సహాయానికి సంబందించిన చెక్కుల ను 84 మంది బాధిత కుటుంబాలకు తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి అందచేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు . అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్తోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని ఈ సందర్బంగా తెలియచేశారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థికంగా అండగా నిలుస్తుందని తెలియచేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలియచేశారు. ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి, నాయి నేని చంద్రకాంత్ రావు, ఉరిటి వెంకట్ రావు,ఙూ=ఖ ప్రసాద్, వీణ ఇబ్రహీం, జిల్లా గణేష్ , మారెళ్ళ శ్రీనివాస్,చంద్రమోహన్ సాగర్, అష్రఫ్, భాషా మరియు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కృష్ణాష్టమి జన్మదినం వేడుకలలో పాల్గొన్న గాంధీ



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 04 (జర్నలిస్ట్ డైరీ) :** శ్రీ కృష్ణాష్టమి పర్వదినమును పురస్కరించుకుని వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని కమల ప్రసన్న నగర్ కాలనీ లో గల ఇస్కాన్ టెంపుల్ లో నిర్వహించిన శ్రీ కృష్ణాష్టమి జన్మదినం వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ .ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.... దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం ఈ భూమిపై అవతరించిన అవతార పురుషుడు శ్రీకృష్ణ భగవానుడి జన్మదినం సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ, ప్రజాప్రతినిధులకుతాజ మాజీ కార్పొరేటర్లకు , నాయకులకు, కార్యకర్తలకు, పాత్రికేయ మిత్రులకు, అభిమానులకు, శ్రేయబిలాషులకు కృష్ణాష్టమి పర్వదినం శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను అని తెలియచేశారు. కృష్ణ జన్మాష్టమి హిందూ ఇతిహాసాలలో శ్రీ మహావిష్ణువు ఎనిమిదవ అవతారం శ్రీకృష్ణుడి జన్మదినం అని. కృష్ణ జన్మాష్టమిని కృష్ణాష్టమి అని లేదా జన్మాష్టమి లేదా గోకులాష్టమి అని కూడా పిలుస్తారు అని తెలియచేశారు. శ్రీకృష్ణుని ఆశీర్వాదం ,కృప కటాక్షం ఎల్లవేళలో ప్రజలందరి పై ఉండాలని కోరుకున్నాను అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయి నేని చంద్రకాంత్ రావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, వీణ ఇబ్రహీం, రాంచందర్, విద్య కల్పన ఏకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు సర్వేపల్లి కాలువ కట్టవాసులకు ఇళ్ల పట్టాల మంజూరు

**-నెల్లూరు సర్వేపల్లి కాలువ కట్టవాసుల 60 ఏళ్ల నిరీక్షణకు తెర**

**-60 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం**

**-1,215 పేద కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా కేబినెట్ నిర్ణయం**

**-మంత్రి నారాయణ చొరవతో సీఎం చంద్రబాబు ఆమోదం**

**-త్వరలో సీఎం చేతుల మీదుగా పట్టాల పంపిణీకి ఏర్పాట్లు**



**నెల్లూరు, అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** నెల్లూరు నగరంలో ఆరు దశాబ్దాలుగా నలుగుతున్న తీవ్రమైన సమస్యకు ఏపీప్రభుత్వం పరిష్కారం చూపింది. సర్వేపల్లి కాలువ కట్టపై నివసిస్తున్న సుమారు 1,215 నిరుపేద కుటుంబాలకు శాశ్వత నివాస హక్కు కల్పిస్తూ ఇళ్ల పట్టాలు మంజూరు చేసేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. దశాబ్దాల తరబడి అభద్రతాభావంతో జీవిస్తున్న పేదల సొంతింటి కలను నెరవేరుస్తూ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

**ఏళ్ల తరబడి ఎదురుచూపులు..**

గత 60 ఏళ్లుగా సర్వేపల్లి కాలువ కట్టపై వేలాది మంది నిరుపేదలు నివాసముంటున్నారు. అయితే, ఆ స్థలాలకు వారికి చట్టబద్ధమైన హక్కులు లేవు. కాలువ పోరంబోకు భూమి కావడంతో, ఎప్పుడు తమ నివాసాలు ఖాళీ చేయిస్తారోనన్న భయంతోనే వారు జీవనం సాగిస్తున్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు పట్టాలు ఇస్తామని హామీలు ఇచ్చినా, అవి కార్యరూపం దాల్చలేదు. దీంతో అక్కడి ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

**మంత్రి నారాయణ ప్రత్యేకంగా దృష్టి**

ప్రస్తుత ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారాయణ, ఈ దీర్ఘకాలిక సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. కాలువ కట్ట వాసుల ఇబ్బందులను, వారి ఆవేదనను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఇటీవల భగత్ సింగ్ కాలనీ వాసుల సమస్యను పరిష్కరించిన స్ఫూర్తితో, ఈ అంశాన్ని కూడా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.

**పోరంబోకు నుంచి 'ఏడబ్ల్యూ డ్రై'గా వర్గీకరణ మార్చేందుకు ఆమోదం**

కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి, మొత్తం 62.70 ఎకరాల భూమిలో 22.31 ఎకరాలను కెనాల్ పోరంబోకు నుంచి 'ఏడబ్ల్యూ డ్రై'గా వర్గీకరణ మార్చేందుకు ఆమోదం తెలిపారు. ఈ ప్రక్రియలో కాలువ నిర్వహణ హక్కులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ నిర్ణయంతో 1,215 కుటుంబాలకు అధికారికంగా ఇళ్ల పట్టాలు పొందేందుకు మార్గం సుగమమైంది.

**ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు**

ప్రభుత్వ నిర్ణయం పట్ల మంత్రి నారాయణ హర్షం వ్యక్తం చేశారు. 60 ఏళ్ల కలను నిజం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తామని ప్రకటించారు. కేబినెట్ నిర్ణయంతో సర్వేపల్లి కాలువ కట్ట వాసులు సంబరాలు చేసుకుంటున్నారు. తమ చిరకాల స్వప్నాన్ని నెరవేర్చిన సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణలకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు

# శ్రీకృష్ణుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**-మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**

**-ఇన్ముల్ నర్వలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 04 (జర్నలిస్ట్ డైరీ) :** కొత్తూర్ మండలం ఇన్ముల్ నర్వ గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు, యాదవ సంఘం సభ్యులకు శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శ్రీ రాములు యాదవ్ తదితరులు, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# రాత్రి పూట ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

**-షాద్‌నగర్‌లో చోరీ కేసును ఛేదించిన పోలీసులు..**

**-ఐఫోన్, ఆపిల్ వాచ్ స్వాధీనం**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 04 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్‌నగర్‌లో రాత్రి పూట ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని షాద్ నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును పోలీసులు ఛేదించారు. పట్టణ సీఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. కేశంపేట మండలానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోని వస్తువులతో పాటు ఒక ఐఫోన్, ఒక ఆపిల్ వాచ్, రూ.20 వేల నగదును అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. టెక్నికల్ ఆధారాలతో దర్యాప్తు చేసిన పోలీసులు రోహిత్ కుమార్ (23)ను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి ఒక ఐఫోన్, ఒక ఆపిల్ వాచ్, రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు బిహార్ రాష్ట్రానికి చెందినవాడిగా, ప్రస్తుతం కొత్తూరు ప్రాంతంలో నివసిస్తూ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో షాద్‌నగర్ డీసీపీ సీ. సిరీష, ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో పోలీసు అధికారులు, క్రైమ్ టీమ్, సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలను ఉపయోగించినట్లు వెల్లడించారు.

# నిడదవెల్లిలో కాంగ్రెస్ పార్టీకి షాక్

**-కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు కొత్త శ్రీశైలం బీఆర్ఎస్ చేరిక**

**-కండువా కప్పి బీఆర్ఎస్ లోకి ఆహ్వానించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 04 (జర్నలిస్ట్ డైరీ) :** కేశంపేట మండలం నిడదవెల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీశైలం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన కార్యాలయంలో శ్రీశైలంకి కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ (1000)వెయ్యి రోజుల పరిపాలనలో ప్రజలందరూ విసిగి చెందారని,తెలంగాణ ప్రజలందరూ కేసీఆర్ గారిని కోరుకుంటున్నారని రానున్న రోజుల్లో కెసిఆర్ గారు మళ్ళీ ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు. నిడదవెల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఎదుగుదలకు కృషి చేయాలని శ్రీశైలంకు సూచించారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.ఈ కార్యక్రమంలో పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్,నిడదవెల్లి మాజీ సర్పంచులు జై సింగ్,బి.జంగయ్య, పాపిరెడ్డి రెడ్డి గూడ సర్పంచ్ తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి, కాకునూర్ మాజీ సర్పంచ్ యారం శేఖర్ రెడ్డి, కొండారెడ్డి పల్లి మాజీ సర్పంచ్ శేఖర్ పంతులు,మాజీ ఉపసర్పంచ్ పల్లాటి కృష్ణయ్య,నాయకులు నాగరాజు, సత్యనారాయణ, పద్మాజీ,G.వెంకటేశ్, తిరుపతయ్య, పద్మాజీ, వెంకటయ్య,తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలే లక్ష్యంగా.. ఎన్డీయే సమన్వయ కమిటీ కీలక భేటీ

**-ఎన్నికల సన్నద్ధత, భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయంపై విస్తృత చర్చ**

**-క్షేత్రస్థాయిలో ఐక్యంగా పనిచేయాలని నాయకుల నిర్ణయం**

**-ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తీర్మానం**



**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఎన్డీయే కూటమి సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో భాగస్వామ్య పక్షాల సమన్వయ కమిటీ కీలక సమావేశం నిర్వహించింది. ఎన్నికల వ్యూహాలు, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థుల విజయమే లక్ష్యంఎన్నికల సన్నద్ధత, భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం, నాయకులు–కార్యకర్తల మధ్య ఐక్యత వంటి అంశాలు ఈ భేటీలో ప్రధాన అజెండాగా ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థుల విజయాన్ని లక్ష్యంగా చేసుకుని పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని నాయకులు నిర్ణయించారు. గ్రామ, మండల స్థాయిలలో కూటమి నేతలంతా సమన్వయంతో పనిచేయాలని తీర్మానించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయం క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసుకుని, ఐక్యంగా పనిచేయడం ద్వారా స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని నాయకులు పిలుపునిచ్చారు

# గుంటూరు బాలిక కిడ్నాప్ కేసు.. నిందితుడు జాన్ సైదా హర్యానాలో అరెస్ట్

**-తీవ్ర కలకలం రేపిన గుంటూరు బాలిక కిడ్నాప్ కేసు**

**-మూడు నెలలైనా బాలిక ఆచూకీ దొరక్కపోవడంపై హైకోర్టు ఆగ్రహం**

**-పోలీసులకు అక్షింతలు!**

**-దాంతో ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న డీజీపీ**

**-సాంకేతిక ఆధారాలతో నిందితుడి ఆచూకీ గుర్తింపు**

**గుంటూరు,మంగళగిరి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** గుంటూరు బాలిక కిడ్నాప్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన షేక్ జాన్ సైదాను పోలీసులు హర్యానాలో అరెస్ట్ చేశారు. మూడు నెలలుగా బాలిక ఆచూకీ లభించకపోవడంపై హైకోర్టు తీవ్రంగా స్పందించిన నేపథ్యంలో, పోలీసులు ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిందితుడిని పట్టుకున్నారు.ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం పెంచుకుని.., మాయమాటలు చెప్పి..

వివరాల్లోకి వెళితే, గుంటూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలికను షేక్ జాన్ సైదా (రబ్బానీ) ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం పెంచుకుని, మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడు. తన కుమార్తె అపహరణకు గురైందని, ఆమెను తమకు అప్పగించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ బాలిక తండ్రి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు.

ఇలాంటి పోలీసులు ఉండటం ప్రభుత్వానికి సిగ్గుచేటు" అంటూ హైకోర్టు ఘాటైన వ్యాఖ్యలు

ఈ పిటిషన్‌పై జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ తుహిన్ కుమార్ ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. మూడు నెలలు గడిచినా బాలిక ఆచూకీ కనిపెట్టలేకపోవడం పోలీసుల వైఫల్యమేనని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఇలాంటి పోలీసులు ఉండటం ప్రభుత్వానికి సిగ్గుచేటు" అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌ను పోలీస్ స్టేషన్‌లోకి రాకుండా అడ్డుకోవడంలో చూపిన శ్రద్ధ, బాలికను రక్షించడంలో ఎందుకు చూపలేకపోయారని న్యాయస్థానం పోలీసుల తీరును తప్పుబట్టింది.

**స్థానిక పోలీసులపై తమకు నమ్మకం లేదని...డీజీపీకి ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు**

ఈ కేసు దర్యాప్తులో స్థానిక పోలీసులపై తమకు నమ్మకం లేదని స్పష్టం చేసిన ధర్మాసనం, బాలికను గురువారం కోర్టులో హాజరుపరచాలని నేరుగా ఏపీ డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఇంత తీవ్రంగా స్పందించడంతో, డీజీపీ సిట్ నియామకం జరిపారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి.

**నిందితుడు జాన్ సైదా హర్యానాలో అరెస్ట్**

ఈ క్రమంలోనే, సాంకేతిక ఆధారాలతో నిందితుడు జాన్ సైదా హర్యానాలో ఉన్నట్లు గుర్తించి, అక్కడికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని, బాలికను గుంటూరుకు తరలించే ప్రక్రియను పోలీసులు ప్రారంభించారు

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# 150 మెడికల్ క్యాంపులు పెడదాం

**- వైద్యులందరూ కలిసి రావాలని కలెక్టర్ పిలుపు**





**ఒంగోలు,ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 ఏళ్లు అవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకలలో భాగంగా ఈనెలలో 150 మెడికల్ క్యాంపులు నిర్వహించాలని ప్రణాళిక రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. నగరం లోని వైద్యులందరూ వీటిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో నగరంలోని డాక్టర్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒంగోలు నగరం విస్తరిస్తున్న తీరు, భవిష్యత్తు అవసరాలను తీర్చేలా నగరాన్ని అభివృద్ధి చేసే విధానాన్ని వివరించారు. ఈ 150 ఏళ్ల వేడుకలలో ఈ దిశగా దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా వైద్య రంగానికీ ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టంగా చేశారు. వివిధ సేవలు అందిస్తున్న ఆస్పత్రులన్నీ ఒకేచోట ఉండేలా మెడికల్ హబ్ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. వైద్యులు కూడా ఒంగోలు నగర విశిష్ట వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్ళడంలో కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. సేవలను విస్తృతం చేయాలని, మెడికల్ క్యాంపుల నిర్వహణకు సహకరించాలని కోరారు.

**ప్రముఖ వైద్యులు, పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ** నగర అభివృద్ధిలో, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్యులు కూడా తమ వంతు బాధ్యత నిర్వహిస్తారని ఈ సందర్భంగా ప్రకటించారు. వైద్యులు మాట్లాడుతూ మెడికల్ హబ్ ప్రతిపాదనను స్వాగతించారు. మెడికల్ క్యాంపుల నిర్వహణ లోనూ సహకరిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఐఎంఏ అధ్యక్షులు నాగయ్య నాయుడు, డిఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, పెద్ద సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాలనను ప్రజలు వద్దకు తీసుకురావడమే 'పల్లెనిద్ర' ముఖ్య ఉద్దేశం

**-ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు**





**గుడ్లూరు,ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** గుడ్లూరు మండలం చిమిడిదిపాలెంలో గురువారం ఏర్పాటు చేసిన పల్లె నిద్ర కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో భాగంగా శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ పీ. రాజా బాబు గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన తొలుత చిమిడిది పాలెం సచివాలయం వద్ద ఉన్న న్యూ కాలనీకి సంబంధించి డ్రింకింగ్ వాటర్ ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి పంట కాలువ . మంచినీటిని పరిశీలించి తగిన పరీక్షలు నిర్వహించి టీడీఎస్ మరియు సెలినిటీని గుర్తించారు. ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించడం తడి చెత్త పొడి చెత్త నుండి విధిగా సేకరిస్తున్నారా తదితర విషయాలను గ్రామస్తులు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా స్వచ్ఛ రథం ద్వారా వాస్తు మార్పిడి జరుగుతున్నదా వివరాలు అడిగి తెలుసుకున్నారు అనంతరం విజీ రాంజీ పనులను సిబ్బందికి తగు సూచన సలహాలు అందజేశారు. ఉపాధి కూలీ ఎన్ని రోజులు పని దినాలు కల్పిస్తున్నారు తదితర విషయాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోశాలను సందర్శించి వాటికి ఆహారాన్ని అందించడంతో పాటు లేగ దూడలకు డి వార్మింగ్ చేయించడం జరిగింది. అనంతరం స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఎలికెరు కాలువను పరిశీలించారు.

**అనంతరం జిల్లా కలెక్టర్ రాజబాబు మాట్లాడుతూ** ప్రభుత్వ పాలనను ప్రజలు వద్దకు తీసుకురావడం ముఖ్య ఉద్దేశంతో పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. గ్రామస్తులు సూచించిన పలు అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందని ఆయన తెలిపారు. వంతెన నిర్మాణం కోరినందున వంతెన నిర్మాణానికి ముశీదస్తుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయడం జరుగుతుందని శాశ్వత ప్రాతిపదికన బ్రిడ్జ్ ఏర్పాటు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నీటి సమస్యను అధిగమించే విధంగా న్యూ కాలనీలో పైపు ద్వారా నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని అదేవిధంగా మురుగు నీరు చేరకుండా సోక్ పిట్లు ఏర్పాటు చేసే విధంగా సంబంధిత అధికారులకు ఆదేశించడం జరిగిందన్నారు. అంగన్వాడీ కేంద్రంలో పర్యటించి పిల్లలకు , బాలింతలు గర్భిణీలకు అందిస్తున్న పోషకాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. రిజర్వ్ ఫారెస్ట్ లో ఎప్పటినుంచో సుమారుగా 60 సంవత్సరాలు పైనుంచి జీవిస్తున్న వారికి శాశ్వత పట్టాలు అందే విధంగా ప్రభుత్వాన్ని సంప్రదించి ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. చిమిడిదిపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న అదనపు గదులు పూర్తిస్థాయిలో నిర్మించే విధంగా ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని చెరువు అభివృద్ధికి 20 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొని సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం గొప్ప విషయం అన్నారు. ప్రజల వద్దకే పరిపాలన అందించడం ప్రభుత్వ లక్ష్యమని అందులో భాగంగానే పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈరోజు జరిగిన కార్యక్రమంలో పలు సమస్యలు అధికారులు దృష్టికి వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగింది అన్నారు.

ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంషి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి చిరంజీవి, స్వర్ణ గ్రామ వార్డు సచివాలయాల అధికారి వెంకటేశ్వరరావు, డిపిఓ అనుపమ,డ్వామా పిడి జోసఫ్, జిల్లా వైద్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాదంబరి జెత్వానీ కేసులో ఐపీఎస్ అధికారులు కాంతి రాణా, విశాల్ గున్ని సస్పెన్షన్ రద్దు

**-ఏపీలో రెండేళ్ల తర్వాత విధుల్లోకి ఇద్దరు ఐపీఎస్‌లు..**
**-వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఉత్తర్వులు జారీ**
**-వారిపై క్రమశిక్షణ, క్రిమినల్ విచారణలు యథావిధిగా కొనసాగుతాయన్న ప్రభుత్వం**
**-అధికార దుర్వినియోగం ఆరోపణలపై 2024 సెప్టెంబర్‌లో సస్పెన్షన్**



**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కాదంబరి జెత్వానీ కేసులో సస్పెన్షన్‌కు గురైన ఇద్దరు ఐపీఎస్ అధికారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఊరట కల్పించింది. ఐపీఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నిలపై ఉన్న సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. అయితే, వారిపై పెండింగ్‌లో ఉన్న క్రమశిక్షణ, క్రిమినల్ విచారణలకు ఎలాంటి ఆటంకం లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

**దాదాపు రెండేళ్ల క్రితం సస్పెన్షన్ వేటు**

దాదాపు రెండేళ్ల క్రితం, 2024 సెప్టెంబర్ 15న ఈ ఇద్దరు అధికారులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. వీరితో పాటు అప్పటి డీజీపీ (ఇంటెలిజెన్స్) పి. సీతారామాంజనేయులు, వెస్ట్ జోన్ ఏసీపీ కె. హనుమంతరావు, ఇబ్రహీంపట్నం సీఐ ఎం. సత్యనారాయణలపై కూడా వేటు పడింది. భూవివాదం, బెదిరింపుల కేసుకు సంబంధించిన దర్యాప్తులో అధికార దుర్వినియోగం, విధివిధానాలు పాటించలేదనే ఆరోపణలపై వీరిని సస్పెండ్ చేశారు.

**కేసు నేపథ్యం ఇదీ..**

2024 ఫిబ్రవరి 2న వైఎస్సార్‌సీపీ నేత కుక్కల విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముంబైకి చెందిన నటి, మోడల్ కాదంబరి జెత్వానీ, ఆమె కుటుంబ సభ్యులపై ఇబ్రహీంపట్నం పోలీసులు ఫోర్జరీ, చీటింగ్, బెదిరింపుల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మరుసటి రోజే విజయవాడ పోలీసు బృందం ముంబై వెళ్లి జెత్వానీని, ఆమె తల్లిదండ్రులను అరెస్టు చేసి విజయవాడకు తీసుకొచ్చింది. అయితే, ఎఫ్ఐఆర్ నమోదు కాకముందే తమను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్లాన్ చేశారని, తమను అక్రమంగా నిర్బంధించి వేధించారని జెత్వానీ ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ఈ ఆరోపణలపై జరిగిన విచారణలో, ఎఫ్ఐఆర్ నమోదుకు ముందే విమాన టికెట్లు బుక్ చేశారని, ఉన్నతాధికారుల ఆదేశాలతోనే అరెస్టు జరిగిందని తేలడంతో ఈ అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది.

**జెత్వానీపై కూడా విచారణ**

మరోవైపు, ఈ కేసులో జెత్వానీపై కూడా విచారణ కొనసాగుతోంది. ఆమెపై దాఖలైన ఛార్జ్‌షీట్‌లో విద్యాసాగర్ నుంచి సుమారు రూ. 1.32 కోట్లు వసూలు చేశారని సీఐడీ ఆరోపించింది. ఈ ఆరోపణలను జెత్వానీ ఖండించారు. తనపై తప్పుడు కేసు బనాయించారని, తానే బాధితురాలినని ఆమె వాదిస్తున్నారు

# గ్రామ ప్రజలపై ఆంజనేయ స్వామివారి ఆశీస్సులు ఉండాలి

**-ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి**
**-కాలనీ తండాలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం**
**-పాల్గొన్న ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి**
**-ఆలయ అభివృద్ధి రూ.50000 విరాళం అందించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 04 (జర్నలిస్ట్ డైరీ) :** ఫరూక్ నగర్ మండలం మెల్లగూడ గ్రామపంచాయతీలోని కాలనీ తండాలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అభివృద్ధి తన వంతుగా రూపాయలు 50,000 విరాళం అందించారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందిరి పై ఆంజజనేయ స్వామి వారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఒక్కరి ఇంట ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు నిండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెల్లగూడ సర్పంచ్ మంగ రవి నాయక్,కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,మాజీ సర్పంచ్ యారం శేఖర్ రెడ్డి,మెల్లగూడ ఉపసర్పంచ్ పాత్లావత్ రాజు నాయక్,నాయకులు మహిపాల్ గౌడ్,రామునాయక్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# యువత ఆధునిక ఆలోచనలతో వ్యాపారంలో రాణించాలి

**-ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి**
**- డ్రై బజార్ ప్రీమియం కార్ స్టూడియో ప్రారంభోత్సవం**
**-ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 04 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్ పట్టణంలో మహబూబ్ నగర్ రోడ్డులో అరవింద్ నూతనంగా ఏర్పాటు చేసిన డ్రై బజార్ ప్రీమియం కార్ స్టూడియో ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ యువత ఆధునిక ఆలోచనలు, సరికొత్త సాంకేతికతను వాడుకుంటూ వ్యాపార రంగంలో రాణించాలని,డ్రై బజార్ ప్రీమియం స్టూడియో వారు అందించే సేవల ద్వారా వాహనాల రీసేల్ వాల్యూ పెరుగుతుందని అన్నారు. వాహనాల ఇంటీరియర్ మరియు ఎక్స్‌టీరియర్ క్లీనింగ్ వంటి మరెన్నో సేవలను వాహనదారులకు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన యాజమాన్యాని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ ఈశ్వర్ రాజు,కానుగు అనంతయ్య,చింటూ ప్రతాప్ రెడ్డి,నందకిషోర్,మాజీ సర్పంచ్ యారం శేఖర్ రెడ్డి,ఉపసర్పంచ్ మామిలపల్లి రాజు, బీఆర్ఎస్ యువ నాయకులు దినేష్ సాగర్, అన్వారీ రాజు,నవీన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు మార్కాపురంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానం

**మార్కాపురం,జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్కాపురం జిల్లాలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని సెప్టెంబర్ 5న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సామా సుబ్బారావు తెలిపారు. జిల్లా లోని మొత్తం మూడు డివిజన్ల పరిధిలో ఎంపికైన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు నేడు (సెప్టెంబర్ 5 న) ఉదయం 9 గంటలకు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన మొత్తం 56 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించనున్నారు. విభాగాల వారీగా ఎంపికైన వారైల్9 ప్రధానోపాధ్యాయులు -- 10 మంది,స్కూల్ అసిస్టెంట్లు -- 20 మంది,సెకండరీ గ్రేడ్ టీచర్లు -- 26 మంది కాగా మొత్తం 56 మంది ఉపాధ్యాయులను ఈ కార్యక్రమంలో ఘనంగా సత్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, శాసనసభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు హాజరుకానున్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చేరుకోవాలని, కార్యక్రమానికి ఎంపికైన ఉపాధ్యాయులు మరియు వారి బంధుమిత్రులు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి కోరారు.

# ఆకట్టుకున్న శ్రీ కృష్ణ వేణుగాన స్వరామృతం..



1 అల్కాపురి శంకర మఠంలో శ్రీ కృష్ణ వేణుగాన స్వరామృతం' కీర్తనలు ఆలాపన చేస్తున్న దృశ్యం

**జర్నలిస్ట్ డైరీ, ఆర్కేపురం:**
ఆర్కేపురం డివిజన్లోని అల్కాపురికాలనీలోని శ్రీ శృంగేరి శంకరమఠంలో శ్రీకృష్ణజన్మాష్టమి పురస్కరించుకొని శుక్రవారం రాత్రి శ్రీ కృష్ణ వేణుగాన స్వరామృతం నిర్వహించారు. శ్రీ శేషం రమణ వేణు విద్యాన్, వారి శిష్య బృందంచే మృతంగము పైన అచ్యుతానంద శ్రీకృష్ణ లీలలు వారి ఇతర కీర్తనలు ఆలాపన చేశారు. ఈ కార్యక్రమానికి అల్కాపురి పరిసర ప్రాంత కాలనీ వాసులు పెద్ద సంబ్యలో పాల్గొన్నారు.
రైటఫ్:

# 72 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు

**ఒంగోలు,ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :**
నేడు (సెప్టెంబర్ 5న )డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా విద్యా కళాశాలల ఆవరణలో ఉదయం 10 గంటలకు ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు.ఈ కార్యక్రమంలో మంత్రి, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్‌తో పాటు వివిధ అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. వీరి సమక్షంలో జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 72 మంది ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు.జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో 12 మంది హెచ్‌ఎంలు, 32 మంది ఎస్‌ఏలు, 28 మంది ఎస్‌జీటీలు ఉన్నారని, వీరి వివరాలు రెండు వెంట్ల జత పరదమై ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల బాధ్యులను దీన్ని ఆహ్వానంగా భావించి కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఓ ప్రకటన విడుదల చేశారు.

# మానవత్వం చాటుకున్న మాజీ సర్పంచ్ ఎడ్లమహేందర్ రెడ్డి

**మృతుని కుటుంబానికి రూ.5000 ఆర్థిక సహాయం**



**జర్నలిస్ట్ డైరీ : రామన్నపేట**
రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన పోచబోయిన మల్లయ్య అనారోగ్యంతో మరణించారు.ఈ విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. అనివార్య కారణాల వల్ల తాను రాలేకపోయినా, మృతుని అంత్యక్రియల నిమిత్తం రూ. 5,000 ఆర్థిక సహాయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎడ్ల నరేందర్ రెడ్డి, ఎడ్ల కృష్ణారెడ్డి, పర్నాటి మాధవరెడ్డి, పిట్ట మహేందర్ రెడ్డి, పినికెసి గోపాల్ రెడ్డి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆమలూరులో ఘనంగా ఉట్లు కొట్టే కార్యక్రమం



**గుర్రంపోడు సెప్టెంబర్ 4 జర్నలిస్ట్ డైరీ :**
నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం ఆమలూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ మేకల రమణ సత్యనారాయణ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి పర్వదిన సందర్భంగా కుట్లు కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఆమలూరు గ్రామంలోని యువకులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మేకల రమణ సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమి పర్వదినం అందరూ సుఖసంతోషాలతో నిర్వహించుకోవాలని శ్రీకృష్ణుని ధర్మ మార్గంలో అందరూ నడుచుకోవాలని తెలియజేశారు ఇట్లు కొట్టే కార్యక్రమంలో మేకల శ్రవణ్ కుమార్ ప్రధమ బహుమతిని గెలుపొందారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు ఆమలూరు గ్రామ పెద్దలు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనపై హోరెత్తిన బీఆర్ఎస్ సమరభేరి

**-హామీల అమలులో ఘోర వైఫల్యం.. ప్రజలను నట్టేట ముంచిన రేవంత్ సర్కార్**
**-ప్రజా సమస్యలను గాలికొదిలేసి మంత్రి పదవి కోసం తిరుగుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి**
**-ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులా? పోలీసుల తీరుపై మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం**



**చండూర్ జర్నలిస్ట్ డైరీ : సెప్టెంబర్ 4**
రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రజలను దగా చేసిందని నిరసిస్తూ.. నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గ పరిధిలోని చండూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ 'సమరభేరి' కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సభలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేశ్ రెడ్డి, నాయకురాలు పాల్వాయి స్రవంతి తదితరులు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.సభలో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ప్రసంగిస్తూ.. రైతులకు యూరియా సకాలంలో అందక, వర్షాలు లేక పత్తి చేలు ఎండిపోతుంటే అన్నదాతల కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ హయాంలో పోరాడి ప్రాజెక్టుల ద్వారా నీటిని తీసుకొచ్చి చెరువులు నింపేలా కృషి చేశామన్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రాజెక్టులకు నీళ్లు తీసుకురావాలనే చిత్తశుద్ధి ఏమాత్రం లేదని మండిపడ్డారు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా, స్థానిక ఎమ్మెల్యే కేవలం మంత్రి పదవి కోసం ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీలేవీ నేటికీ అమలుకు నోచుకోలేదని నాయకులు విమర్శించారు. మహిళలకు నెలకు రూ. 2,500, రైతు కూలీలకు సాయం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వృద్ధులకు రూ. 4,000 పింఛన్ ఇస్తామని చెప్పి మాట తప్పారని దుయ్యబట్టారు. కేసీఆర్ ప్రభుత్వంలో నిరంతర విద్యుత్, తాగునీరు, కల్యాణ లక్ష్మి, రైతుబంధు, న్యూట్రిషన్ కిట్లు వంటి అనేక సంక్షేమ పథకాలు అందేవని, కాంగ్రెస్ వచ్చాక మళ్లీ కరెంట్ కోతలు, తాగునీటి ఎద్దడి మొదలయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మున్సిపాలిటీకి రూ. 40 కోట్లు, 100 పడకల ఆసుపత్రి, మార్కెట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తే.. ఇప్పటివరకు వాటిని పూర్తి చేయించడంలో ప్రస్తుత ఎమ్మెల్యే విఫలమయ్యారని ఎద్దేవా చేశారు.హామీల అమలుపై ప్రశ్నించిన కాంగ్రెస్ కార్యకర్త శివను అక్రమంగా పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడాన్ని కూసుకుంట్ల తీవ్రంగా ఖండించారు. ప్రజల తరఫున నిలదీసే గొంతులను నొక్కేయాలని చూడటం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టని, వెంటనే శివను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అధికార పార్టీ కార్యకర్తల్లా వ్యవహరించడం మానుకోవాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని హితవు పలికారు. రాజకీయం చేయాలనుకుంటే ఖాకీ చొక్కాలు తీసేసి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకోవాలని హెచ్చరించారు.రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడే ప్రజా సమస్యలకు పూర్తి పరిష్కారం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద మాజీ ఎంపీపీ తోకల వెంకన్న, మాజీ మున్సిపల్ చైర్మెన్ తోకల చంద్రకళ,పల్లె రవి,బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొత్తపాటి సతీష్,మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న,మండల ఆధికార ప్రతినిధి బొడ్డు సతీష్ గౌడ్,మాజీ మండల పార్టీ అధ్యక్షులు పెద్దగోని వెంకన్న గౌడ్, బిఆర్ఎస్ నాయకులు తెలుకుంటచంద్రశేఖర్,
అన్నేపర్తి శేఖర్, సామ యాదవ రెడ్డి,గుర్రం వెంకట్ రెడ్డి,స్థానిక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ నాయకులు, మహిళా విభాగం నేతలు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలి

**-సీఎం రేవంత్‌రెడ్డి నకిరేకల్ సభలో స్పష్టమైన ప్రకటన చేయాలి**
**-అసెంబ్లీ సమావేశాల్లో నిధులు కేటాయించాలి**
**-సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్**




**రామన్నపేట సెప్టెంబర్ 04 జర్నలిస్ట్ డైరీ :**
యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట: రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి మండలంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రికి నూతన భవనం మంజూరి చేస్తున్నట్లు నకిరేకల్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించి అసెంబ్లీ సమావేశల్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వాసుపత్రి ఎదుట కార్యకర్తలతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.డి. జహంగీర్ మాట్లాడుతూ రామన్నపేట మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.ప్రస్తుతం ఆసుపత్రిలో సరిపడా పడకలు, వైద్య సిబ్బంది, అవసరమైన మౌలిక వసతులు లేక, పోవడంతో, శిదిలావస్థకు చేరిన భవనంతో పేద ప్రజలు దూర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నకిరేకల్ పర్యటనకు వస్తున్న సందర్భంగా రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసే అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన కోరారు.ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించవచ్చని అన్నారు.ఇటీవల జిల్లా మంత్రి కోమటిరెడ్డి 6నెలల్లో ఆసుపత్రి పూర్తి చేస్తామని ప్రకటించి రెండు నెలలు కావస్తుందని ఇప్పటికి ఎలాంటి చలనం లేదని అన్నారు.రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసే వరకు సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఎం.డి. జహంగీర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం,మండల కార్యదర్శివర్గ సభ్యులు కందుల హనుమంతు, కల్లూరి నగేష్,మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బుర్రు అనిల్ కుమార్,మండల నాయకులు గొరిగే సోములు,గాదె నరేందర్,నీల అయిలయ్య, తోలుపునూరి శ్రీనివాస్,శాఖ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు శానగొండ రాము, పల్లె సత్యం, బావండ్లపల్లి సత్యం,ఎండీ లతీఫ్,ఆముద ఆంజనేయులు, జల్లెల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్రంపోడు మండలంలో

# వైభవంగా గ్రామ దేవతల జలాభిషేకం

**సర్పంచుల ఫోరం అధ్యక్షులు గంగలి కృష్ణ ఆధ్వర్యంలో పూజలు.**



**గుర్రంపోడు:సెప్టెంబర్ 4: జర్నలిస్ట్ డైరీ :**
గుర్రంపోడు మండల పరిధిలోని చింతగూడెం, శాఖాజిపురం గ్రామపంచాయతీలో గ్రామ దేవతలకు జలాభిషేకం కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. గుర్రంపోడు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు గంగల కృష్ణ ఈ కార్యక్రమానికి ముఖ్య నేతృత్వం వహించారు. గ్రామాల్లోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, అలాగే పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ ఈ ప్రత్యేక జలాభిషేక పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా గ్రామాల్లో ఉదయం నుంచే పండుగ వాతావరణం నెలకొంది. స్థానిక మహిళలు బోనాలతో, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తరలివచ్చి గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు సమర్పించారు. అనంతరం దేవతామూర్తులకు శాస్త్రోక్తంగా జలాభిషేకం నిర్వహించారు.ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో గ్రామ వార్డు మెంబర్లు, వివిధ సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. అందరి సామూహిక భాగస్వామ్యంతో ఈ జలాభిషేకం కార్యక్రమం అత్యంత విజయవంతంగా ముగిసింది.

## బిజినెస్

# భారీగా పెరిగిన బంగారం ధరలు

**శ్రీకృష్ణాష్టమి వేళ పసిడి ధరలకు రెక్కలు.. రెండో రోజూ భారీ పెరుగుదల**




బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు మరోసారి భారీగా పెరిగాయి. శ్రీకృష్ణాష్టమి రోజున పసిడి ధరలు వినియోగదారులకు షాకిచ్చాయి. వరుసగా రెండో రోజు కూడా బంగారం ధరలు గణనీయంగా పెరగడంతో కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. 22 క్యారెట్లకు చెందిన 10 గ్రాముల బంగారం ధర రూ.1,200 పెరిగి రూ.1,43,600కు చేరింది. అదే సమయంలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,310 పెరిగి రూ.1,56,660కు చేరుకుంది. దీంతో పసిడి ధరలు మరోసారి రికార్డు స్థాయిల వైపు కదులుతున్నాయి. ఇక వెండి ధర కూడా స్వల్పంగా పెరిగింది. కిలో వెండి ధరపై రూ.100 పెరగడంతో రూ.2,55,100కు చేరింది. తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే ధరలు కొనసాగనున్నాయి. వరుసగా బంగారం ధరలు పెరుగుతుండటంతో శుభకార్యాలు, పండుగల సందర్భంగా కొనుగోళ్లు చేయాలనుకునే వారిపై అదనపు భారం పడుతోంది.

# లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

**-362 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్.. 23,897 వద్ద ముగిసిన నిఫ్టీ**




ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న సానుకూల పరిస్థితులు, కీలక షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు లాభాలను నమోదు చేశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 362.57 పాయింట్లు పెరిగి 76,515.43 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 24.25 పాయింట్లు లాభపడి 23,897.70 వద్ద ముగిసింది. మార్కెట్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్ వంటి ప్రముఖ కంపెనీల షేర్లు లాభాల్లో ముగిశాయి. దీంతో సూచీలు రోజంతా కొంత సానుకూలంగా కదలాడాయి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లతో పాటు ఆసియా మార్కెట్లలోనూ లాభాల వాతావరణం కనిపించడం దేశీయ మార్కెట్లకు కలిసొచ్చింది. ఇక అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్‌లో బంగారం ఔన్స్ ధర 4,472 డాలర్లుగా కొనసాగుతోంది. క్రూడాయిల్ ధర 95.52 డాలర్ల వద్ద ఉంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 94.49 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్ల కదలికలు, రూపాయి మారకం విలువ, ముడిచమురు ధరలు రానున్న రోజుల్లో దేశీయ స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# ట్రావెల్ రంగంలోకి స్విగ్గీ ఎంట్రీ

**'క్రూ' పేరుతో ప్రీమియం ట్రావెల్ కాన్సియర్జ్ సేవలు ప్రారంభం**

ఫుడ్ డెలివరీ రంగంలో ప్రముఖ సంస్థగా ఉన్న స్విగ్గీ తాజాగా ట్రావెల్ రంగంలోకి అడుగుపెట్టింది. 'క్రూ' పేరుతో ప్రీమియం ట్రావెల్ కాన్సియర్జ్ సేవలను గురువారం ప్రారంభించింది. ప్రయాణికులకు ప్రత్యేకమైన, వ్యక్తిగతీకరించిన ట్రావెల్ సేవలను అందించడమే లక్ష్యంగా ఈ కొత్త సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం 'క్రూ' సేవలు పరిమిత వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. పెయిడ్ మెంబర్లు, సంస్థ నుంచి ఆహ్వానం పొందిన ప్రయాణికులు క్రూ యాప్ ద్వారా ఈ సేవలను వినియోగించుకోవచ్చు. ప్రయాణ ప్రణాళికలు, ప్రత్యేక ఏర్పాట్లు, ఇతర ట్రావెల్ సంబంధిత అవసరాల్లో వ్యక్తిగత సహాయాన్ని




అందించేలా ఈ సేవలను రూపొందించినట్లు సంస్థ తెలిపింది. గత ఏడాది వ్యక్తిగత కాన్సియర్జ్ సేవగా 'క్రూ'ను స్విగ్గీ ప్రారంభించింది. వినియోగదారుల నుంచి ఈ సేవకు మంచి స్పందన, బలమైన డిమాండ్ రావడంతో తాజాగా దీన్ని విస్తరించి ట్రావెల్ రంగంలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. ఫుడ్ డెలివరీతో పాటు వివిధ సేవల విభాగాల్లో తన కార్యకలాపాలను విస్తరిస్తున్న స్విగ్గీకి 'క్రూ' ఎంట్రీ మరో కీలక అడుగుగా మారింది.

## స్పోర్ట్స్

# సెమీస్‌లో సాత్విక్ జోడీ ..
# క్వార్టర్స్‌లోనే కంగుతిన్న శ్రీకాంత్..!

చైనా మాస్టర్స్ 2026లో భారత డబుల్స్ ద్వయం అదరగొట్టింది. పురుషుల క్వార్టర్ ఫైనల్లో అద్భుతంగా ఆడిన సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి జోడీ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. హోరాహోరీగా సాగిన మూడ సెట్ల పోరులో అస్ట్రుప్ -- రస్ముసెన్(డెన్మార్క్) జంటను చిత్తు చేసింది సాత్విక్ జోడీ. అయితే.. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్(ఖఱఝుఎఎఱ రాతీఱఝుత్ష్ర) పోరాటం ముగిసింది. అదిరే ఆటతో క్వార్టర్ ఫైనల్ చేరిన అతడు లీ చీక్ యూ(హాంకాంగ్) చేతిలో వరస సెట్లలో వెనకబడి.. ఓటమి పాలయ్యాడు.బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 750 ఈవెంట్‌లో భారత డబుల్స్ ద్వయం సెమీస్‌లో అడుగుపెట్టింది. శుక్రవారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో తొలి సెట్‌ను 21-13తో గెలిచిన సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి జంట.. ఆపైనా మరింత చెలరేగింది. అస్ట్రుప్ -- రాస్ముస్సెన్ జంట 16-21తో రెండో సెట్ గెలిచి మ్యాచ్‌ను మూడో సెట్‌కు తీసుకెళ్లింది. నిర్ణయాత్మక సెట్‌లో పంజా విసిరిన భారత ద్వయం 21-18తో మట్టికరిపించింది. డెబ్బై నిమిషాల పోరులో ప్రత్యర్థిని గొప్పగా నిలువరించిన సాత్విక్ జోడీ సెమీస్ బెర్తు




దక్కించుకుంది.

పట్టు సడలించి..

ఇదే ఈవెంట్‌లో పతకంపై ఆశలు రేపిన కిడాంబి శ్రీకాంత్ మాత్రం క్వార్టర్స్‌లో కంగుతిన్నాడు. శుక్రవారం మ్యాచ్ ఆరంభంలో లీ చెక్ యూపై చకచకా రెండు పాయింట్లు సాధించిన అతడు.. ఆపై ఆదే జోరు చూపలేకపోయాడు. అనూహ్యంగా పుంజుకున్న హాంకాంగ్ ప్లేయర్ అద్భుతంగా భారత షట్లర్‌ను నిలువరించాడు. తొలి సెట్‌ను 21-16తో గెలుచుకున్న లీకి.. రెండో సెట్‌లో శ్రీకాంత్ షాకిస్తూ వరసగా నాలుగు పాయింట్లు సాధించాడు. కానీ, కాసేపటికే ఆధిక్యాన్ని తగ్గించినా.. భారత ఆటగాడు 15-14తో సెట్ సొంతం చేసుకుంటాడనిపించింది.కానీ, పట్టువదలని లీ.. 21-16తో సెట్‌నూ, మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. దాంతో, శ్రీకాంత్ వరసగా అతడి చేతిలో నాలోగో ఓటమి చవిచూశాడు. చివరగా 2018 ఇండియా ఓపెన్‌లో లీపై విజయం సాధించాడీ మాజీ వరల్డ్ నంబర్ 1. హాంకాంగ్ షట్లర్ చేతిలో భారత సీనియర్‌కు ఇది వరసగా నాలుగో పరాజయం. మ్యాచ్ పోయినా కాసింత గర్వపడాల్సిన విషయం ఏంటంటే.. గత మూడేళ్లలో ఒక బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 750 ఈవెంట్‌లో శ్రీకాంత్ క్వార్టర్స్ ఆడడం ఇదే మొదటిసారి.

# వరల్డ్‌కప్ విజేతపై రెండేళ్ల నిషేధం.. 62 మందిపై బీసీసీఐ చర్యలు..!



దేశవాళీ క్రికెట్‌లో మెరుస్తున్న యువ క్రికెటర్లకు భారత క్రికెట్ నియంత్రణ మండలి బిగ్ షాకిచ్చింది. అండర్-19 వరల్డ్‌కప్ విజేత రవి కుమార్ , అండర్19 స్క్వాడ్‌లోని రోహిత్ యాదవ్ లపై నిషేధం విధించింది. వయసు పరమైన నేరానికి పాల్పడినందున వీరిద్దరిని రెండేళ్లు సస్పెండ్ చేసింది బీసీసీఐ. రోహిత్ యాదవ్‌పై రెండేళ్లు నిషేధం విధించాం. మరో 62మందిని కూడా రెండేళ్ల కాలానికి సస్పెండ్ చేశాం అని శుక్రవారం బీసీసీఐ వర్గాలు తెలిపాయి.భారత అండర్-19 స్క్వాడ్‌లోని రోహిత్ యాదవ్‌పై రెండేళ్ల నిషేధం విధించింది బీసీసీఐ. ఇటీవలే శ్రీలంకపై రాణించి.. ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికైన ఈ లెగ్ స్పిన్నర్‌కు ఇది ఊహించని షాక్. అలానే 2022లో అండర్-19 వరల్డ్‌కప్ గెలుపొందిన భారత జట్టులోని సభ్యుడు రవి కుమార్ కూడా వేటుకు గురయ్యాడు. ఉత్తరప్రదేశ్‌కు చెదిన రోహిత్ జట్టులో చోటు కోసం తన వయసును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశాడు. ఈ విషయాన్ని పసిగట్టిన బీసీసీఐ విచారణ చేపట్టింది. శ్రీలంక పర్యటన సమయంలో అతడు సమర్పించిన వయసు ధ్రువీకరణ పత్రాల్లో పుట్టిన సంవత్సరం వేర్వేరుగా ఉంది.ఆధార్‌లో ఒకలా.. ఒకదాంట్లో రోహిత్ 2007లో జన్మించినట్టు ఉండగా.. ఆధార్ కార్డులో మాత్రం 2009లో రోహిత్ పుట్టినట్టు ఉంది. ఇదివరకే ఈ విషయం తెలిసిన బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ రోహిత్‌ను జూనియ్ స్థాయిలో ఆడనివ్వలేదు. ఇప్పుడు బీసీసీఐ కూడా అతడి పుట్టిన సంవత్సరంలో తేడాలు ఉండడాన్ని తీవ్రంగా పరిగణించింది. అతడు తన వయసును దాచేందుకు ప్రయత్నించాడని నిర్ధారించుకున్న భారత బోర్డు రెండేళ్లు సస్పెండ్ చేసింది. అతడితో పాటు వయసు సంబంధిత ధ్రువపత్రాలు సరిగ్గా లేని 62 మందిపై వేటు వేసింది బీసీసీఐ. అంతేకాద.. ఎడమ చేతివాటం స్పిన్నర్ విశాల్ భాట్టి సైతం ఈ లిస్ట్‌లో ఉన్నాడు. ఈ అరవై రెండు మందిని 2026-27, 2027-28 దేశవాళీ సీజన్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవదద్దని బీసీసీఐ తెలిపింది.

# ఈస్ట్ జోన్‌తో ఫైనల్..
# తిలక్ వర్మ బృందంలో సిరాజ్, పడిక్కల్..!

దేశవాళీ సీజన్ 2025-26 తొలి ట్రోఫీ అయిన దులీప్ ట్రోఫీ ఫైనల్లో భారత స్టార్లు ఆడనున్నారు. శ్రీలంక పర్యటన ముగియడంతో పేసర్ సిరాజ్ , యువ బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్ ఈ టోర్నీలో బరిలోకి దిగనున్నారు. లంకపై మెరిసిన వీరిద్దరూ సౌత్ జోన్ జట్టు తరఫున చెలరేగనున్నారు. సెప్టెంబర్ 6 ఆదివారం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో ఈస్ట్ జోన్‌తో ఫైనల్ జరుగనుంది.దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు ముందే సౌత్ జోన్ జట్టు మరింత పటిష్టంగా మారనుంది. సెమీస్‌లో నార్త్ జోన్‌పై సూపర్ విక్టరీ కొట్టిన సౌత్ బలాన్ని పెంచుతూ.. శ్రీలంకపై సెంచరీలతో చెలరేగిన దేవ్‌దత్ పడిక్కల్, ప్రధాన పేసర్ సిరాజ్‌లు జట్టుతో కలువనున్నారు. శ్రీలంకపై మూడు ఇన్నింగ్స్‌ల్లో పడిక్కల్ రెండు సెంచరీలతో 328 రన్స్ సాధించగా.. సిరాజ్ మాత్రం నాలుగే వికెట్లతో నిరాశపరిచిన విషయం తెలిసిందే.ఇప్పటికే కేఎల్ రాహుల్ కూడా స్క్వాడ్‌లో చేరడంతో.. తిలక్ వర్మ కెప్టెన్సీలోని ఆ టీమ్ ఆత్మవిశ్వాసం రెట్టింపు కానుంది. ఇషాన్ కిషన్





సారథ్యంలోని ఈస్ట్ జోన్ సెమీఫైనల్లో సెంట్రల్ జోన్‌ను చిత్తు చేసి ఫైనల్లో అడుగుపెట్టింది. మరో సెమీస్‌లో నార్త్‌పై 7 వికెట్ల విజయంతో టైటిల్ పోరుకు సిద్ధమైంది సౌత్. సెప్టెంబర్ 6 ఆదివారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇరు జట్లు అంతిమపోరులో అమీతుమీ తేల్చుకోనున్నాయి.

**సౌత్ జోన్ స్క్వాడ్(అప్డేటెడ్)**

కేఎల్ రాహుల్, దేవ్‌దత్ పడిక్కల్, కరుణ్ నాయర్, తిలక్ వర్మ(కెప్టెన్), రికీ భూ(వైస్ కెప్టెన్), నారాయణ్ జగదీశన్, కొడమెల హిమతేజ, షేక్ రషీద్, రవిచంద్రన్ స్మరణ్, అభినవ్ తెజ్రన, సిరాజ్, సీవీ మిలింద్, అమన్ ఖాన్, శ్రేయాస్ గోపాల్, కావూరి సాయితేజ, తనయ్ త్యాగరాజన్, త్రిపురణ విజయ్.

# తొలిసారి 'హారర్ కామెడీ' బాటలో మాస్ మహారాజా




బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట మొదలైతే ఎలా ఉంటుందో మాస్ మహారాజా రవితేజ మరోసారి నిరూపించారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి' చిత్రం ఘనవిజయం సాధించి థియేటర్లలో కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ఈ చిత్రం తాజాగా రూ. 200 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. ఈ బ్లాక్‌బస్టర్ విజయాన్ని పురస్కరించుకుని చిత్ర బృందం విడుదల చేసిన ప్రత్యేక పోస్టర్ సైతం అభిమానులను విశేషంగా ఆకర్షిస్తోంది. సినిమా ఆరంభంలో బేబీ నక్షత్ర, రవితేజ, ప్రియా భవానీ శంకర్‌లపై చిత్రీకరించిన అన్‌సీన్ స్టిల్‌ను చిత్ర దర్శకుడు శివ నిర్వాణ పంచుకుంటూ సక్సెస్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న రవితేజ, తన భవిష్యత్ ప్రాజెక్టుల విషయంలో వేగాన్ని పెంచడమే కాకుండా ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే సరికొత్త పంథాను ఎంచుకుంటున్నారు. ఎప్పుడూ రొటీన్ మాస్, కమర్షియల్ ఫార్ములాకే పరిమితం కాకుండా, కెరీర్‌లోనే మునుపెన్నడూ చేయని వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుడుతున్నారు. ఈ సరికొత్త ప్రయాణంలో భాగంగా టాలీవుడ్‌లో వైవిధ్యమైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వివేక్ ఆత్రేయతో రవితేజ చేతులు కలిపారు. 'సరిపోదా శనివారం' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత వివేక్ ఆత్రేయ సిద్ధం చేసిన కథ రవితేజను అమితంగా ఆకట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రవితేజ తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఎన్నడూ టచ్ చేయని 'హారర్ కామెడీ' జోనర్‌లోకి తొలిసారిగా అడుగుపెడుతుండటం సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. సాధారణంగా మాస్ యాక్షన్, ఫ్యామిలీ డ్రామా, క్రైమ్ థ్రిల్లర్లతో పాటు పక్కా ఎంటర్‌టైనర్లలో రవితేజ తన మార్క్ చూపించారు. అయితే ప్రేక్షకులను భయపెడుతూనే కడుపుబ్బా నవ్వించే హారర్ కామెడీ తరహా పాత్రను ఆయన ఇంతవరకు చేయలేదు. వివేక్ ఆత్రేయ మార్క్ విలక్షణమైన స్క్రీన్‌ప్లే, రవితేజ అసమానమైన ఎనర్జీ, టైమింగ్ తోడైతే వెండితెరపై నవ్వుల విందు గ్యారెంటీ అని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. లక్ష్మణ్, శ్రీని సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ఉంది. వివేక్ ఆత్రేయ చిత్రంతో పాటే మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను కూడా రవితేజ ఖరారు చేశారు. 'రాజ రాజ చోర', 'స్వాగ్' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో ఓ అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్ తెరకెక్కనుంది. ప్రముఖ నిర్మాత దిల్ రాజు (శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్) నిర్మిస్తున్న ఈ చిత్రంలో టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు మరో ప్రధాన పాత్రలో సందడి చేయనున్నారు. రవితేజ మార్క్ జోష్‌కు శ్రీవిష్ణు పంచ్‌లు జతకలిస్తే వినోదం ఏ స్థాయిలో ఉంటుందో ఊహించుకోవచ్చు. ఈ మల్టీస్టారర్ చిత్రాన్ని 2027 సంక్రాంతి పండుగ కానుకగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. మొత్తానికి హసిత్ గోలి సినిమా పూర్తి కాగానే వివేక్ ఆత్రేయ హారర్ కామెడీ సెట్స్‌పైకి వెళ్లనుంది.



చీరకట్టులో బాపు బొమ్మలా..

# సంక్రాంతి రేసులో 'కాకా'.. హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్!



టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద మరోసారి రికార్డులను తిరగరాసేందుకు మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ (కె.ఎస్. రవీంద్ర) మరో అడుగు ముందుకు వేస్తున్నారు. వీరిద్దరి కలయికలో ఇప్పటికే వచ్చిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'వాల్తేరు వీరయ్య' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ క్రేజీ కాంబోలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాకా' సినిమాకు సంబంధించిన కీలకమైన షూటింగ్ అప్‌డేట్‌ను చిత్రబృందం వెల్లడించింది. ఈ భారీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన తదుపరి కీలక షెడ్యూల్ సెప్టెంబర్ 7వ తేదీ నుంచి హైదరాబాద్ వేదికగా ప్రారంభం కానుంది. ఈ తాజా షెడ్యూల్‌లో సినిమాలోని కొన్ని ముఖ్యమైన సన్నివేశాలతో పాటు హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లను తెరకెక్కించడానికి దర్శకుడు బాబీ ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత వెంకట్ నారాయణ అత్యంత భారీ బడ్జెట్‌తో, ఎక్కడా రాజీ పడకుండా నిర్మిస్తున్నారు. నిర్మాణానంతర కార్యక్రమాలు మరియు షూటింగ్‌ను శరవేగంగా పూర్తి చేస్తున్న మేకర్స్, ఈ సినిమాను 2027 సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి కొత్త లుక్‌లో కనిపించబోతున్న ఈ చిత్రంలో ఆయనతో పాటు నటి అనస్వర రాజన్, నివేతా పేతురాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# గాయం కూడా మంచికే!

'ఒక్కోసారి చెడు కూడా మంచే చేస్తుంది. 'మైసా' షూట్‌లో తగిలిన గాయం ఓ విధంగా నాకు మంచే చేసింది' అంటూ ఆనందం వెలిబుచ్చారు అగ్ర కథానాయిక రష్మిక మందన్నా. తాజాగా తన గాయం గురించి రష్మిక మాట్లాడుతూ 'పెళ్లయితే అయ్యిందికానీ.. సినిమా కమిట్‌మెంట్ల కారణంగా కలిసి ఉండే సమయం మాత్రం మాకు కరువైంది. పెళ్లి జరిగాక మూడునెలల పాటు మేమిద్దరం ఒకరినొకరం చూసుకోలేదంటే నమ్ముతారా!? కేవలం ఫోన్లలోనే మాట్లాడుకునేవాళ్లం. మా అవస్థ చూసి విధికి కూడా బాధ కలిగినట్టుంది. దాంతో నాకు విశ్రాంతి ఇద్దామని ఫిక్స్ అయ్యింది. అందుకే ఈ గాయమైంది కావొచ్చు. వినడానికి వింతగా అనిపించినా.. ఈ సమయం మాత్రం నాకు చాలా నచ్చింది. ఈ నెలరోజులూ ఇద్దరం ఇంట్లోనే హాయిగా గడిపాం. 'ఎలాంటి గాయాలూ లేకుండా మనం ఇలా ఎన్నో రోజులు గడపాలి' అని విజయ్ అనేవాడు. తను ఆటపట్టిస్తుంటే నాకెంతో ఆనందంగా ఉండేది. ఈ విశ్రాంతి రోజులన్నీ నాకు అద్భుతమైన జ్ఞాపకాలుగా నిలిచిపోయాయి. నాకు కొరియన్ డ్రామాలంటే పిచ్చి. విజయ్‌కేమో సీరియస్ డ్రామాలు, షోలు ఇష్టం. ఈ ఖాళీ టైమ్‌లో ఇద్దరం కలిసి రెండూ కవర్ చేశాం' అంటూ సరదాగా చెప్పుకొచ్చారు రష్మిక. ఇదిలావుంటే.. గాయం నుంచి కోలుకున్న రష్మిక తిరిగి మళ్లీ షూటింగ్స్‌తో బిజీ కానున్నారు. ఇప్పటికే ముగింపు దశలో ఉన్న 'మైసా' చిత్రాన్ని ఆమె పూర్తి చేయనున్నారు. నవంబర్ 27న పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానున్నది. ఇక తన భర్త విజయ్ దేవరకొండతో కలిసి ఆమె నటిస్తున్న 'రణబాలి' అక్టోబర్ 16న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న విషయం తెలిసిందే

# కమల్‌హాసన్ కొత్త సినిమా



గత ఏడాది విడుదలైన 'థగ్ లైఫ్' తర్వాత అగ్ర నటుడు కమల్‌హాసన్ కొత్త సినిమా పట్టాలెక్కలేదు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రజనీకాంత్‌తో కలిసి ఓ మల్టీస్టారర్ సినిమా ప్రకట జరిగింది. దాంతో పాటు స్టంట్ మాస్టర్ అన్బరివ్ దర్శకత్వంలో కూడా కమల్‌హాసన్ ఓ సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అయితే ఇప్పటివరకు ఈ రెండు చిత్రాలు ప్రకటనల వరకే పరిమితమై పోయాయి. ఈ నేపథ్యంలో అభిమానుల్ని సర్‌ప్రైజ్ చేస్తూ ఎస్.యు.అరుణ్‌కుమార్ దర్శకత్వంలో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు కమల్‌హాసన్. గురువారం కమల్‌హాసన్ లుక్ టెస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో చేతిలో ఆయుధాన్ని ధరించి పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. యాక్షన్ ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని ఫస్ట్‌లుక్‌ని చూస్తే అర్థమవుతున్నది. 'సేతుపతి' 'చిత్తా' చిత్రాలతో తమిళంలో మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు దర్శకుడు ఎస్.యు.అరుణ్‌కుమార్. తాజాగా ఆయన కమల్‌హాసన్‌ను డైరెక్ట్ చేయడం తమిళ సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఈ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుందని మేకర్స్ తెలిపారు. రాజ్‌కమల్‌ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకాలపై కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465